

చిన్నారులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

- జిల్లాలో రెండు విడతలుగా స్పెషల్ క్యాంపులు
- అంగన్‌వాడీ సెంటర్లలో ఆధార్ కేంద్రాలు
- అపార్‌కు ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు

మదనపల్లె టౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఒకే గుర్తింపు కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నెంబర్ మంజూరుకు ఎన్నో ఇబ్బందులు వస్తున్నాయి. జిల్లాలో మూడు వారాలుగా విద్యార్థులకు ఇస్తున్న అపార్ గుర్తింపు కార్డుల కార్యక్రమం 74 శాతం మాత్రమే పూర్తయ్యింది. ఆధార్, అపార్ కేంద్రాల కౌంటర్లు ఏర్పాటు చేసినా సాంకేతిక లోపాలు, పుట్టినరోజు తేదీలు, ఇంటిపేర్ల మార్పుల వలన అపార్ కార్యక్రమం జోరందుకోలేదు. దీంతో భవిష్యత్‌లో అపార్ గుర్తింపు కార్డుల మంజూరులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం 0-6 వయస్సు గల చిన్నారులకు పకడ్బందీగా ఆధార్ నెంబర్లు కేటాయించేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ సెంటర్లలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయనుంది

చిన్నారులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

జిల్లాలో 1,858 మెయిన్, 417 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిలో 0-6 ఏళ్లలోపు చిన్నారులు 94,785 మంది ఉన్నారు. వీరందరికీ ఆధార్ నెంబర్లు కేటాయించాలని కలెక్టర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా 30 మండలాల్లో 200 అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఆయా మండలాల ఎంపీడీవోలు ఆధార్ కేంద్రాల నిర్వాహకులు, ఆధార్ కేంద్రాల చిరునామ, తదితర విషయాలను తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. తొలి విడతగా ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు, రెండో విడతగా 26 నుంచి 29వ తేదీ వరకు ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల్లో చిన్నారులకు ఐరిష్, వేలిముద్రల సహాయంతో ఆధార్ నెంబర్లు మంజూరు చేయనున్నారు. గతంలో చేసిన తప్పిదాలు పునరావృతం కాకుండా, ఈ సారి పకకడ్బందీగా చిన్నారులకు ఆధార్ గుర్తింపు కార్డులు మంజూరు చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని పట్టణాల్లో మున్సిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోలు పర్యవేక్షించనున్నారు.

అపార్‌కు ఇబ్బందులు రాకూడదనే..

ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఒకటో తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు 2,74,251 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత మూడు వారాలుగా అన్ని మండలాలు, పట్టణాల్లో అపార్ కౌంటర్లు ఏర్పాటు చేసి విద్యాశాఖ, మున్సిపల్, మండల పరిషత్ అధికారులు విద్యార్థులకు అపార్ నెంబర్లు మంజూరు చేస్తున్నారు. వీరిలో ప్రాథమిక పాఠశాలల్లో 1,16,656 మందికి గాను 1,03,346 మంది విద్యార్థులకు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 80,362 మందికి గాను 65,839 మందికి అపార్ కార్డు నెంబర్లు జనరేట్ అయ్యాయి. తొమ్మిది, 10 తరగతులకు 47,625 మందికి గాను 30,255 మందికి నెంబర్లు జనరేట్ అయ్యాయి. ఇకపోతే ఇంటర్ విద్యార్థులకు 29,608 మందికి గాను 9,501 మందికి మాత్రమే అపార్ నెంబర్లు వచ్చాయి. మొత్తం మీద శనివారం నాటికి జిల్లా వ్యాప్తంగా 76.22 శాతం అపార్ నెంబర్లు కేటాయించారు.

అపార్ నమోదుపై నిత్యం కలెక్టర్ సమీక్ష

30 మండలాల్లో అపార్ నమోదు శాతం చూస్తే లక్కిరెడ్డిపల్లె మండలం 86.09 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, బి.కొత్తకోట మండలం 69.08 శాతంతో చివరన ఉంది. కాగా మదనపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, పీలేరు నియోజకవర్గ కేంద్రాల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో ఇక్కడ అపార్ నమోదు శాతం కాస్త తక్కువగా అనిపించినా, ఎక్కువ మంది విద్యార్థులు ఉండటంతో కొన్ని ఇబ్బందులు వస్తున్నాయి. ముఖ్యంగా ఇంటర్‌మీడియట్ విద్యార్థులకు అపార్ నెంబర్లు కేటాయించడంతో ఎక్కువ ఇబ్బందులు వస్తున్నాయి. ఈ సమస్యలన్నింటిని అధిగమించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ నిత్యం అధికారులతో సమీక్షిస్తున్నారు. సమస్యలన్నింటిని అధిగమించడానికి అధికారులు కృషి చేయాలని సూచిస్తున్నారు. మరో వారం రోజుల్లో జిల్లాలోని అందరు విద్యార్థులకు అపార్ కేటాయింపు పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు 18న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి సహా గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ప్రయాణికులకు చుక్కలు

- ఆరున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచిన ఎక్స్‌ప్రెస్ రైలు

ములకలచెరువు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జంక్షన్ నుంచి తిరుపతికి నడిచే సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రయాణికులకు చుక్కలు చూపించింది. ఆరున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడిచింది. దీంతో రైలులో ఉన్న ప్రయాణికులు, రైలు కోసం వేచి చూసిన ప్రయాణికులు పడ్డ అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. సికింద్రాబాద్ నుంచి ములకలచెరువుకు మీదుగా తిరుపతికి నడిచే ఈ రైలు ఆదివారం సాంకేతిక కారణాలతో ఆలస్యంగా బయలుదేరడంతో ఈ పరిస్థితి నెలకొంది. ములకలచెరువుకు తెల్లవారుజామున 2.49 గంటలకు రావాల్సిన ఈ రైలు ఉదయం 9.10 గంటలకు వచ్చింది. అలాగే మదనపల్లెకు రోడ్‌కు తెల్లవారుజామున 3.19 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 9.41 గంటలకు, కలికిరికి తెల్లవారుజామున 3.49 గంటలకు రావాల్సి ఉండగా 10.05 గంటలకు, పీలేరుకు తెల్లవారుజామున 4.09 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 10.24 గంటలకు, తిరుపతికి ఉదయం 6.25 గంటలకు వెళ్లాల్సి ఉండగా 11.45 గంటలకు వెళ్లింది.

తిరుపతి-సికింద్రాబాద్ రైలు కూడా...

తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు ఆదివారం రాత్రి నడవాల్సిన రైలు కూడా ఆలస్యమైంది. తిరుపతిలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరాల్సిన తిరుపతి-సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు 3 గంటలు ఆలస్యంగా 8 గంటలకు బయలుదేరింది. దీంతో పీలేరు. కలికిరి, ములకలచెరువుకు మూడు గంటలు ఆలస్యంగా వచ్చింది.

మాధవరెడ్డి కస్టడీకి అనుమతి ఇవ్వండి

- మదనపల్లె కోర్టులో సీఐడీ పిటీషన్?

రాయచోటి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్ దహనం కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అనుచరుడు మదనపల్లెకు చెందిన మాధవరెడ్డిని తమ కస్టడీకి కోరుతూ సీఐడీ పోలీసులు కోర్టులో పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. మదనపల్లె వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నెంబర్ 135/2024 కింద మాధవరెడ్డిపైన సబ్ కలెక్టరేట్‌లో ఫైల్స్ దహనం కేసులో అనుమానితుడిగా కేసు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో మాధవరెడ్డి ఇప్పటికే ముందస్తు బెయిల్ తెచ్చుకున్నాడు. ఈ కేసు విచారణలో సీఐడీ పోలీసులు ఇటీవల జోరు పెంచిన నేపథ్యంలో మాధవరెడ్డిని తమ కస్టడీకి కోరుతూ మదనపల్లె కోర్టులో పిటీషన్ దాఖలు చేసినట్లు తెలిసింది.

గూడుపల్లె దేవర చెరువులోకి నీరు వెళ్లని దృశ్యం



ఇసుకాసురుల పాపం...గూడుపల్లె గ్రామ ప్రజలకు శాపంగా మారింది. పురాతన చెక్‌డ్యాం వద్ద ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా చేపట్టడంతో కింద పునాదులు కదిలి గుంతలు ఏర్పడి నీరు గూడుపల్లె గ్రామంలోని దేవర చెరువులోకి రాకుండా వృథాగా పోతున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు అడ్డూ అదుపు లేకుండా చేపట్టిన ఇసుక తోడివేత, తవ్వకాల వల్ల చెక్‌డ్యాంలో నీరు నిల్వ ఉండడం లేదు. దీంతో మొత్తం గ్రామానికే ఆదరువైన గూడుపల్లె దేవర చెరువు నేడు నీరు లేక వెలవెలబోతోంది. ఫలితంగా భూగర్భజలాలు వృద్ధి చెందడం లేదు. ఇటీవల గ్రామస్థులు చందాలు వేసుకుని చెక్‌డ్యాం కింద ఏర్పడ్డ గుంతలు పూడ్చేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. పాపాఘ్ని కాలువలో నీరు బాగా పారుతున్నా గూడుపల్లె దేవర చెరువులోకి రావడం లేదు. దీంతో చెరువులోకి నీరు వచ్చే కాలువలో చుక్క నీరు కన్పించడం లేదు.

- ఇష్టారాజ్యంగా పాపాఘ్ని చెక్‌డ్యాం వద్ద ఇసుక తవ్వకాలు
- వైసీపీ పాలనలో ఇసుక తోడివేత
- చెక్‌డ్యాం పునాదులు కదిలి నిలవని నీరు
- గూడుపల్లె దేవర చెరువులోకి రాని పాపాఘ్ని జలాలు

ఇసుకాసురుల పాపం.. గూడుపల్లెకు శాపం

ములకలచెరువు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలంలో పాపాఘ్ని నదిపై నిర్మించిన సీజీ ప్రాజెక్టు గత నెలలో కురిసిన వర్షాలకు నిండింది. దీంతో పాపాఘ్ని కాలువ నిండుగా ప్రవహిస్తోంది. ఈ పాపాఘ్ని కాలువ శ్రీసత్యసాయి- అన్నమయ్య జిల్లా సరిహద్దులో ఉన్న ములకలచెరువు మండలం ఎనుమలవారిపల్లె మీదుగా వెళుతుంది. ఎనుమలవారిపల్లె సమీపంలోని ఏటిగడ్డ వద్ద పాపాఘ్ని కాలువపై చెక్‌డ్యాం నిర్మించారు. చెక్‌డ్యాం నిండితే పక్కనే ఉన్న గూడుపల్లె చెరువులోకి పాపాఘ్ని జలాలు వెళ్లే విధంగా ఉపకాలువ ఉంది. ఈ కాలువ ద్వారా చెరువులోకి జలాలు వస్తే నిండుతుంది. చెరువు నిండితే తిరిగి మొరవ ద్వారా పాపాఘ్ని కాలువలోకే నీరు వెళుతుంది. ఈ పాపాఘ్ని జలాలు కడప జిల్లాలోని గండికోట రిజర్వాయర్‌కు చేరతాయి. గూడుపల్లె దేవర చెరువు నిండితే పంచాయతీలోని అన్ని గ్రామాల్లో భూగర్భజలాలు ఎంతో వృద్ధి చెందుతాయి. తాగునీటి, సాగునీటి బోర్లలో నీరు పుష్కలంగా ఉంటాయి. అలాగే చెరువు కింద ఉన్న వెయ్యి ఎకరాలకుపైగా ఆయకట్టు భూములు సాగులోకి వస్తాయి. ఐదేళ్లుగా ఇక్కడ భిన్న పరిస్థితులు నెలకొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో యథేచ్ఛగా జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలు గూడుపల్లె గ్రామ రూపురేఖలనే మార్చేశాయి. పాపాఘ్ని చెక్‌డ్యాం వద్ద ఇష్టానుసారంగా చేపట్టిన ఇసుక అక్రమ తవ్వకాల వల్ల చెక్‌డ్యాం బలహీనపడి కింద గుంతలు ఏర్పడ్డాయి. గుంతల కారణంగా పాపాఘ్ని జలాలు చెక్‌డ్యాంలో నిలవడం లేదు. దీంతో చెక్‌డ్యాం నిండే పరిస్థితులు లేక పాపాఘ్ని కాలువ పక్కనున్న గూడుపల్లె చెరువుకు జలాలు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. దీంతో చెరువులోకి నీరు రావడం లేదు. ఫలితంగా చెరువు కింద ఉన్న వెయ్యి ఎకరాల ఆయకట్టు భూములు సాగులోకి రావడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తాగు, సాగునీటి బోర్లు అడుగంటే ప్రమాదం ఉంది. దేవరచెరువులోకి నీరు లేకుండా ఆ ప్రభావం గ్రామంలోని చెరువుకిందపల్లె, ఎనుమలవారిపల్లె, పాత గూడుపల్లె, గాలివారిపల్లె, కనుగొండవారిపల్లె, గూడుపల్లె, కోనేటివారిపల్లె, రెడ్డిపల్లోళ్లపల్లె, తనకంటి వారిపల్లె, కోటపల్లె గ్రామాలపై పడుతుంది.



దేవర చెరువులో అరకొరగా ఉన్న నీరు

చందాలు వేసుకుని మట్టి తోలిన గ్రామస్థులు

పాపాఘ్నిపై నిర్మించిన చెక్‌డ్యాం కింద నుంచి నీరు వెళ్లిపోతుండడంతో దేవర చెరువులోకి నీరు రావడం లేదు. ఇటీవల శ్రీసత్యసాయి జిల్లాలోని సీజీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో పాపాఘ్నిలో నీరు ఉధృతంగా ప్రవహించాయి. దీంతో ఒకరోజు మాత్రమే చెరువులోకి నీరు అరకొరగా వచ్చాయి. తరువాత నీరు రాలేదు. చెక్‌డ్యాం కింద ఏర్పడ్డ గుంతలు పూడ్చితే చెరువులోకి నీరు వస్తాయని గ్రామస్థులు భావించారు. దీంతో పంచాయతీలోని అన్ని గ్రామాల ప్రజలు చందాలు వేసుకుని ట్రాక్టర్ల సాయంతో చెక్‌డ్యాంకు ఆనుకుని పెద్ద ఎత్తున మట్టి తోలారు. చెక్‌డ్యాం కింద ఏర్పడ్డ గుంతలు పూడ్చేందుకు యత్నించారు. అయినా ఫలితం లేకుండాపోయింది. నీటి ఉధృతిని మట్టి నిలువరించకపోయింది. మట్టి కొట్టుకుపోయి చెక్‌డ్యాం కింద నీరు వెళ్లిపోతోంది. ఇసుకాసురుల పుణ్యమా అని చెక్‌డ్యాం దెబ్బతిని ప్రజలకు శాపంగా మారింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వమైనా చొరవ తీసుకుని చెక్‌డ్యాం కింద మరమ్మతులు చేయించి పాపాఘ్ని జలాలు గూడుపల్లె చెరువులోకి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చెక్‌డ్యాం కింద గుంతలు పూడ్చేందుకు ప్రయత్నించాం..



ఏటిగడ్డ వద్ద ఉన్న చెక్‌డ్యాం కింద ఏర్పడ్డ గుంతల కారణంగా దేవర చెరువులోకి నీరు రావడం లేదు. చెక్‌డ్యాం దెబ్బతినడంతో అంతా కలిసి చందాలు వేసుకుని చెక్‌డ్యాం కింద ఏర్పడ్డ గుంతలు పూడ్చేందుకు ప్రయత్నించాము. అయినా చెక్‌డ్యాంలో నీరు నిలువ లేదు. దేవరచెరువులోకి పాపాఘ్ని జలాలు రావడం లేదు. దేవర చెరువు నిండితే ఎంతో మేలు జరుగుతుంది. భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి.

- వెంకటరమణ, రైతు, చెరువుకిందపల్లె

ఇసుక తోడేయడంతోనే చెక్‌డ్యాం దెబ్బతింది..




ఇసుకను ఇష్టానుసారంగా తోడేయడంతోనే చెక్‌డ్యాం కింద పునాది దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. చెక్‌డ్యాం వద్ద కూడా ఇసుకను ఎత్తారు. ఫలితంగా చెక్‌డ్యాం కింద గుంతలు ఏర్పడి నీరు దేవర చెరువులోకి రావడం లేదు. దీంతో ఈ ప్రాంతంలో వచ్చే రోజుల్లో భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉంది. వేసవిలో గడ్డు పరిస్థితులు ఏర్పడవచ్చు.

- రెడ్డిశేఖర్, యువ రైతు, గూడుపల్లె



గూడుపల్లె పంచాయతీ ఎనుమలవారిపల్లె సమీపంలో ఏటిగడ్డ వద్ద ఉన్న చెక్‌డ్యాం కింద వెళుతున్న నీరు



పాపాఘ్ని కాలువలో ప్రవహిస్తున్న సీజీ ప్రాజెక్టు నీరు

అక్రమంగా ఇసుక తరలింపు

- ఏటిలో రాళ్లనూ వదలని నాయకులు
- తహసీల్దార్ హెచ్చరికలతో వెనుతిరిగిన యంత్రాలు, ట్రాక్టర్లు

రైల్వేకోడూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరపురాజుపల్లెకు వెళ్లే దారిలో ఉన్న ఏరులో ఇసుక, రాళ్లు, మట్టి తదితరాలను కొందరు అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఏటిలో ఎక్స్‌కవేటర్‌లను పెట్టి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఎక్స్‌కవేటర్‌ను ఉంచి ఇసుకతో కూడిన రాళ్లను అక్రమంగా తరలిస్తున్నారని స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో తహసీల్దార్ ఫోన్ చేసి అక్రమంగా తరలించడం నేరమని, అధికారుల అనుమతి తీసుకోవాలని హెచ్చరించడంతో యంత్రాలు, ట్రాక్టర్లతో అక్కడి నుంచి వెనుతిగారు. అయితే సాయంత్రం మళ్లీ ఎక్స్‌కవేటర్ పెట్టి తవ్వకాలు చేశారు. అక్రమంగా తరలించిన ఇసుకతో కూడిన రాళ్లను రోడ్లు, ఇళ్ల ప్లాట్లకు ఉపయోగిస్తున్నారు. ఏరుకు అటువైపు ఇటువైపు పట్టా పొలాలు ఉన్నాయి. ఏటిలో మట్టి తదితర వాటిని విచ్చలవిడిగా తవ్వకాలు చేయడంతో తమ భూములు కోతలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఆదివారం ఈ తంతు జరుగుతోందని స్థానికులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ అక్రమాలపై తగు చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానికులు కోరుతున్నారు. కాగా వైసీపీ ప్రభుత్వంలో జరిగినట్లుగానే కూటమి ప్రభుత్వంలోనూ కొందరు నాయకులు చేస్తున్నారని ప్రజలు చెప్పుకుంటున్నారు. దీనిపై ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని వాపోతున్నారు.



తహసీల్దార్ హెచ్చరికలు చేసినా మళ్లీ ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు చేస్తున్న దృశ్యం



చట్టపరమైన చర్యలు తీసుకుంటాం..


ఏర్లలో మట్టి, ఇసుకతో కూడిన రాళ్లను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. ఏర్లలో మట్టి, ఇసుకతో కూడిన రాళ్లను తీసుకునిపోవాలంటే దానికి నిబంధనలు ఉంటాయి. ఇటు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అనుమతి తీసుకుని తరలించుకోవాలి. అలా కాకుండా ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటాం.

- మహబూబ్‌చాంద్, తహసీల్దార్

ఎస్టీ సాధన కోసం ఐక్యంగా పోరాడదాం

- ర్యాలీలో వాల్మీకి, బోయ సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులు, బోయలను ఎస్టీలో చేర్చేందుకు ఐక్యంగా పోరాడదామని ఏపీ వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ క్రాంతినాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక దేశాయ్ ఫంక్షన్‌హాల్‌లో ఏపీ వాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర కోర్‌కమిటీ సభ్యులు నాగినేని గోవిందు ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఏపీవాల్మీకి, బోయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ క్రాంతినాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగ్గుల శ్రీనివాసులు, కడప జిల్లా నుంచి ఆదినారాయణ, అన్నమయ్య జిల్లా సురేష్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులు, బోయలను ఎన్నో దశబ్దాలుగా ఎస్టీ జాబితాలోకి మారుస్తామని చెబుతూ ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు మోసం చేస్తూ వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తున్నా ఎన్నికలకు ముందు హామీలు ఇస్తూ పదవి దక్కిన తరువాత మర్చిపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అందరూ ఐక్యంగా పోరాటాలు చేసి రాష్ట్రంలోని వాల్మీకి, బోయప్రతినిధులతో చర్చించి అసెంబ్లీలో మనవాణిని వినిపించాలని కోరారు. అంతకు ముందు అంబేడ్కర్ సర్కిల్ నుంచి వాల్మీకి బోయ ఎస్టీ సాధన కోసం చిత్తూరు బస్టాండ్‌లోని వాల్మీకి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై వాల్మీకి-వాల్మీకి, బోయ ఎస్టీ సాధన కోసం పోరాడుదాం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు గంపల గంగురాజు, తలారి శ్రీనివాసులు, కొత్తూరు చిన్నరెడ్డెప్ప, చెన్నం వెంకటరమణ, బొమ్మనపల్లె లక్ష్మన్న, పారేశి గోపాల్, మేకల లక్ష్మీనారాయణ, లక్ష్మీపతి, టీచర్ రెడ్డెప్ప, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లెలో ర్యాలీ చేస్తున్న వాల్మీకి, బోయసంఘం నాయకులు

వేడుకగా.. పెద్దదర్గా ఉరుసు

- చాదర్ సమర్పించిన కలెక్టర్

కడప కల్చరల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతం, ప్రముఖ సూఫీ క్షేత్రమైన కడప అమీన్‌పీర్ దర్గా ప్రధాన ఉరుసు ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం దర్గా పీఠాధిపతి హజ్రత్ సయ్యద్‌షా ఆరిఫుల్లా హుసేనీ సాహెబ్ దర్గాలో గురువుల మజార్లపై గంధం సమర్పించారు. తొలుత దర్గా ముషాయిరా హాలులో వార్షిక నివేదిక సమర్పించారు. రాత్రి ఆషారే షరీఫ్‌లో భాగంగా దర్గాలోని గురువుల స్మారక వస్తువుల దర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి ఫకీర్ల విన్యాసాలు, బ్యాండు మేళాల మధ్య పీఠాధిపతి గంధం కలశాన్ని తమ ఇంటి నుంచి ఊరేగింపుగా దర్గాకు తీసుకువచ్చారు. అనంతరం భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసి పవిత్ర గ్రంథాన్ని దర్గా గురువుల మజార్ వద్ద సమర్పించారు. విశేష ప్రార్థనలు నిర్వహించి భక్తులందరికీ పాతెహా ప్రసాదాన్ని పంచిపెట్టారు. అలాగే ఉత్సవాల్లో భాగంగా కడప నగరం పెద్దబజారుకు చెందిన వస్త్ర వ్యాపారులు పూలచాందినితో పాటు వారి పక్షాన గంధాన్ని దర్గాకు చేర్చి చదివింపులు చేశారు. అనంతరం దేశంలోని ప్రముఖ గాయకులు తమ ఖవ్వాలీ గానంతో భక్తులను ఉర్రూతలూగించారు. వారు దర్గా గురువుల మహిమలు, పవిత్రత తదితర అంశాల గురించి గానం చేశారు. కాగా.. కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఇన్‌చార్జి ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు సంప్రదాయంగా చాదర్‌ను సమర్పించారు. ఉత్సవాలలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్ధన రెడ్డి, బి.హరిప్రసాద్, నేతలు జిలానీబాషా, సలావుద్దీన్, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తదితరులు పాల్గొన్నారు.

మెరిసిన దర్గా ప్రాంగణం

ఉరుసు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6గంటల నుంచి దర్గా ప్రాంగణం భక్తజనంతో కిటకిటలాడింది. దర్గాలో ప్రార్థనలు చేసుకునేందుకు వచ్చిన భక్తులతో పాటు బయటి ప్రాంతాల నుంచి భక్తుల సందడి పెద్దగా కనిపించింది. దర్గా చుట్టు పక్కల హిందువుల దేవాలయాల వద్ద కూడా నిర్వాహకులు విద్యుత్ దీపాలంకరణ చేయడం గమనార్హం. పోలీసులు, జిల్లా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.



కడప పెద్ద దర్గాకు చాదర్ తీసుకొస్తున్న కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

వెల్లివిరిసిన మత సామరస్యం

● అయ్యప్ప మాలధారులకు ముస్లింల అన్నదానం



అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్న సంస్థ సభ్యులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో మతసామరస్యం వెల్లివిరిసేలా హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకులు అబూబకర్ సిద్ధిక్, తన సభ్యులతో కలిసి ఆదివారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా మతసామరస్యంతో సోదర భావాన్ని పెంపొందిస్తూ పవిత్ర అయ్యప్పస్వామి మాలధారులకు స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో భిక్షను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటగా అయ్యప్ప చిత్రపటానికి పూజ నిర్వహించి, హారతి ఇచ్చిన అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, ఆబిద్, మొఖద్దర్, ముఫీ, హనీఫ్, సమీర్, పవన్, సాయిదీపక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపిన కొండచిలువ



ప్రజలు కొట్టిచంపిన కొండచిలువ

కాశినాయన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నర్సాపురం తహసీల్దారు కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై శనివారం రాత్రి కొండచిలువ కనిపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. నిత్యం రాత్రి పది గంటల వరకు ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో కొండ చిలువ దర్శనమివ్వడం కలకలం రేపింది. తహసీల్దారు కార్యాలయ పరసరాల నుంచి సమీపంలోని ముళ్ల కంపలోకి రోడ్డుదాటుకొని వెళ్లే సమయంలో ప్రజల కంటపడింది. గమనించిన పాదచారులు చుట్టుపక్కల వారికి తెలియజేయడంతో అందరూ కలిసి కర్రలతో కొట్టిచంపారు. దాదాపు రెండు మీటర్లకు పైగా పొడవు ఉన్న ఈ కొండచిలువ తక్కువ వయస్సు కల్గి ఉందని, ఎక్కడి నుంచి వచ్చిందో అంతుబట్టడం లేదని స్థానికులు అంటున్నారు.

గత పాలకుల నిర్ణయం డీసీఎంఎస్‌కు శాపం

● ఐదేళ్లలో రూ.6 కోట్ల నష్టం
● అందని కమీషన్లు
● అయోమయంలో అధికార యంత్రాంగం



కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) నష్టాల్లో కూరుకుపోతోంది. రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు సర్కారు చేసే బాధ్యతను కొన్ని దశాబ్దాల కాలంగా చేపడుతూ వచ్చేది. అయితే గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంది. ఉన్న వ్యాపారం చేజారిపోవడంతో డీసీఎంఎస్ మనుగడ కోల్పోయే పరిస్థితి నెలకొంది. అప్పుడప్పుడూ ఇతర వ్యాపారాలు చేస్తున్నప్పటికీ ప్రైవేటు వ్యాపారుల ముందు పోటీకి తట్టుకోలేక వ్యాపారాలు చేయలేక దిక్కులు చూడడం డీసీఎంఎస్ అధికారుల వంతైంది. ఈ క్రమంలో గతంలో చేసిన వ్యాపారాల ద్వారా ఆశించిన లాభాలను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వాటిపై వచ్చే వడ్డీలతో, గదులు, స్థలాలపై వచ్చే అద్దెలతో సిబ్బంది జీతాలు పొందుతున్న పరిస్థితి నెలకొంది.

ఐదేళ్లలో రూ.6 కోట్లు నష్టం

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో డీసీఎంఎస్ సుమారు రూ.6 కోట్లు నష్టాన్ని చవి చూడాల్సి వచ్చిందని సమాచారం. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు విత్తనాలు, ఎరువులు రైతులకు విక్రయించడం ద్వారా ఏడాదికి దాదాపు కోటి రూపాయలు ఆదాయం సమకూరేది. వీటి విక్రయాల బాధ్యత పూర్తిస్థాయిలో రైతు భరోసా కేంద్రాలకు అప్పగించడంతో గడిచిన ఐదేళ్ల కాలంలో సుమారు ఐదారు కోట్ల రూపాయల వ్యాపారం కోల్పోయింది. గతంలో లాగా విత్తనాలు ఎరువుల విక్రయాలు ఉంటే సంస్థలోని సిబ్బందికి డీసీఎంఎస్ రైతు వినిమయ కేంద్రాల్లో పని దొరికేది. ఆ వ్యాపారం లేకపోవడంతో సిబ్బందికి కూడా తగినంత పనిలేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ అంశంపై గతంలో ఉన్న పాలకవర్గాలు కూడా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురాలేకపోవడంతో డీసీఎంఎస్‌లకు నష్టాలు తప్పలేదు. సహకారరంగం ఏర్పడిందే రైతులకు సేవలు అందించేందుకు అని చెబుతుంటారు. కానీ ప్రభుత్వ పాలసీ ఇందుకు విరుద్ధంగా అమలైనా అడిగే వారు లేకపోవడంతో ప్రభుత్వ నిర్ణయం డీసీఎంఎస్‌కు శాపంగా మారింది. ఇది వరకు కొనసాగిన పాలకవర్గాలు కూడా ఇతర వ్యాపారాలు, సరఫరా పనులకు కాంట్రాక్టు తేవడంలో కూడా సరైన చొరవ చూపెట్టక పోవడంతో సంస్థ నష్టాల బాటలో నడుస్తుందనే చర్చ సాగుతోంది.



రైతుభరోసా కేంద్రం

అందని కమీషన్లు

చేసిన పనికి సకాలంలో కమీషన్లు అందకపోవడంతో డీసీఎంఎస్ పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేపట్టడంతో నష్టపోతున్న డీసీఎంఎస్‌కు రైతు ఉత్పత్తులను సేకరించడం ఒక ఆదాయ వనరుగా ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం ఏపీ మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ క్రమంలో డీసీఎంఎస్ చేసిన పనికి కొంతమేర కమీషన్ ఇచ్చేవారు. ఈ తరుణంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా దాదాపు రూ.రెండున్నర కోట్ల వరకు డీసీఎంఎస్‌కు రావాల్సి ఉందనేది సమాచారం. అదే విధంగా పౌరసరఫరాల సంస్థ నుంచి దాదాపు రూ.70 లక్షలు అందాలని తెలుస్తోంది. వీటికి సంబంధించిన బకాయిలు వసూలైతే కొంత మేర ఊరట కలిగే అవకాశం ఉంది. నిధులు లేకపోవడంతో సిబ్బందికి తగినన్ని విధులు లేనట్లు తెలుస్తోంది. ఒక పక్క ప్రభుత్వానికి సంబంధించిన విద్య ఇన్‌స్టిట్యూట్లకు అవసరమైన సామగ్రిని సరఫరా చేసేందుకు కాంట్రాక్టు కోసం ప్రయత్నిస్తూ ఉన్నప్పటికీ అందిన పరిస్థితి లేదు. ఐసీడీఎస్‌కు, కస్తూర్బా స్కూళ్లకు అవసరమైన నిత్యావసర వస్తువులు, ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీని సరఫరా అవకాశం ఉన్నప్పటికీ అందుకు తగిన అవకాశాలు దక్కకపోవడంతో డీసీఎంఎస్ అధికార యంత్రాంగం అయోమయంలో ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక అధికారి బాధ్యతలు ఇచ్చారు. అంతేకాకుండా దిశ నిర్దేశం చేసేందుకు సహకార శాఖ నుంచి ఒక సీనియర్ అధికారికి డీసీఎంఎస్ పనితీరుపై పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారి చొరవతో వివిధ శాఖలకు సంబంధించిన వస్తువుల సరఫరా బాధ్యతలు డీసీఎంఎస్‌కు అందుతాయని అధికారులు, సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కమీషన్ల వసూళ్లకు ప్రయత్నిస్తున్నాం

- ఖాదర్‌వల్లి, ఇన్‌చార్జ్ బిజినెస్ మేనేజరు, డీసీఎంఎస్

ఏపీ మార్క్‌ఫెడ్ సివిల్ సప్లై నుంచి దాదాపు రూ.మూడు కోట్లు కమీషన్లు రావాల్సి ఉంది. వాటి వసూళ్ల కోసం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నాం. ప్రభుత్వ శాఖలకు అవసరమైన స్టేషనరీ, సామగ్రి సరఫరా పనులు దక్కితే మరింత బాగుంటుంది.

గొలుసు దొంగల అరెస్టు

● రూ. 30 లక్షల నగలు, మోటార్‌సైకిళ్ల స్వాధీనం



చైన్‌స్నాచర్లను చూపుతున్న ఎస్పీ మణికంఠ తదితరులు

పలమనేరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఒంటరి మహిళలకు కునుకు లేకుండా చేస్తున్న చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్టు చేశారు.ఇటీవల గొలుసు దొంగతనాలు బాగా పెరిగిన విషయం తెలిసిందే. మహిళలకు బయటికెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో 8మంది చైన్ స్నాచర్లను అరెస్టు చేసి రూ. 30 లక్షలకు పైగా విలువ చేసే బంగారు నగలు, మోటరు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు.పలమనేరు డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ మణికంఠ వివరాలను వెల్లడించారు. పుంగనూరులో ఈనెల 1వతేది ఓ మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లారు.పుంగనూరు ఆర్టీసీ డిపోలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బుక్యాప్రసాద్‌నాయక్ ఈనెల 15వతేది పుంగనూరు మినీ బైపాస్ రోడ్డుపై వెళ్తున్న ఓ మహిళ మెడలోనుంచి చైన్ లాక్కెళ్తుండగా స్థానికులతో కలిసి పుంగనూరు సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ లోకేష్ వెంబడించారు. అతడిని అరెస్టు చేసి రూ.6.50 లక్షల విలువైన 69 గ్రాముల మూడు బంగారు చైన్లు, ఒక మోటరు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.లోన్ యాప్‌లో రుణాలు తీసుకొని చెల్లించలేక ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. కొద్ది రోజులుగా చౌడేపల్లి, గంగవరం, కురబలకోట, రామసముద్రం, పలమనేరు, శాంతిపురం, బైరెడ్డిపల్లి మండలాల్లో ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలో బంగారు గొలుసులను లాక్కెళ్లిన ఏడుగురిని అరెస్టు చేసి చైన్లను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మండలం ఏటిగడ్డపల్లికి చెందిన ముద్దం చంద్రశేఖర్(32), హరికృష్ణ(24), మదనపల్లెకు చెందిన దాసరి నాగరాజు అలియాస్ నాగ (38), ఎల్.భాస్కర్(37),కె. పవన్‌కుమార్(27) బి.కొత్తకోటకు చెందిన పి.బావాజాన్ (35), చౌడేపల్లి మండలం మదుకూరుకు చెందిన గుంతలపేట లక్ష్మీపతి అలియాస్ చంటి(30) అరెస్టు అయిన వారిలో వున్నారు. వీరి వద్ద చోరీ చేసిన 332 గ్రాముల బంగారు ఆభరణాలు, దొంగతనాలకు ఉపయోగించిన మూడు మోటరు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో చైన్‌స్నాచర్స్‌ను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఏఎస్ఐ శ్రీనివాసులు నాయుడు, కానిస్టేబుళ్లు అల్లావుద్దీన్, శశిధర్, బాలాజి, రెడ్డెప్ప, వెంకటరమణ, ఎల్లప్పలకు రివార్డులను ఎస్పీ అందజేశారు.అలాగే గొలుసులను పోగొట్టుకున్న బైరెడ్డిపల్లి మండలం రామసముద్రం గ్రామానికి చెందిన అలివేలుతో పాటు మరో ఇద్దరు మహిళలకు బంగారు చైన్లను ఎస్పీ మణికంఠ అందజేశారు.

వృద్ధురాలిపై పంది దాడి



తీవ్రంగా గాయపడ్డ వృద్ధురాలు

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు శ్రీరామ్‌నగర్‌కు చెందిన బొర్రా నాగమ్మ (75) అనే వృద్ధురాలిపై పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల కాలంలో చెన్నూరు వ్యాప్తంగా పందుల సంచారం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలిని ఒక్కమారుగా పంది దాడి చేయడంతో కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో ఆ వృద్ధురాలిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి అనంతరం కడపకు తీసుకెళుతున్నట్లు బంధువులు తెలిపారు. కాగా పందుల సంచారంపై పలుమార్లు స్థానిక పంచాయతీలో ఫిర్యాదు చేయడం, కార్యదర్శి పోలీసు సిబ్బందితో వాటిని పట్టించినా స్థానికంగా ఉన్న కొందరు నేతలు పట్టుబడిన పందులను మేపేవారి కోరిక మేరకు మరలా వాటిని కొంత దూరం వెళ్లాక బయటికి వదిలేయడం జరుగుతుంది. దీంతో పందుల సంఖ్య పెరగడమే తప్ప తగ్గడం లేదు. ఈ విషయంపై తక్షణం చర్యలు తీసుకోవాలని పందుల సంచారం లేకుండా నిర్మూలించాలని అన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



లభ్యమైన గణేశ్ మృతదేహం

వల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల క్రితం పుష్పగిరి పెన్నానదిలో గల్లంతైన రెడ్డిపల్లె గణేశ్ (27) మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఫైర్ సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్ల సాయంతో శుక్ర, శని వారాల్లో నదిలో వెతికిన విషయం పాఠకులకు విదితమే. కాగా ఆదివారం సిద్దవటం మండలం లింగంపల్లె పెన్నానది ఒడ్డున మృతదేహం బయటపడినట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

భార్యను కత్తితో పొడిచిన కేసులో నిందితుడి అరెస్ట్

● 14 రోజుల రిమాండ్

కాశినాయన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలరాజుపల్లె గ్రామంలో గత శుక్రవారం భార్య సుబ్బలక్ష్మమ్మను కత్తితో పొడిచిన కేసులో దాడికి పాల్పడిన భర్త బసిరెడ్డి రామిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. బాధితురాలు సుబ్బలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామిరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి ఆదివారం బద్వేల్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

శ్మశాన స్థలం కబ్జా

● తెల్లవారుజామున ప్రహరీ కూల్చివేత
● పోలీసులకు సర్పంచ్ ఫిర్యాదు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్ఐ

పుల్లంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేటలో కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నా అర్ధరాత్రి రెండు గంటల వరకు కాపుగాసిన కూడా కబ్జారాయుళ్లు బెదరలేదు. పుల్లంపేట పోలీసుస్టేషనుకు అతి దగ్గరలో ఉన్న పుల్లంపేట శ్మశానానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్ కూల్చి పోలీసులకు సవాల్ విసిరారు. పుల్లంపేట టౌన్‌లో తహసీల్దారు కార్యాలయానికి ఆనుకుని ఉన్న సర్వేనంబరు 280లో 6.20లో తోపు పొరంబోకు భూమి ఉంది. ఏడాది క్రితం రూ.5 లక్షల జడ్పీ నిధులతో కొంతమేర కాంపౌండ్‌వాల్‌ను నిర్మించారు. శ్మశానానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను కూల్చివేసి ఆక్రమణ చేస్తున్నారని పోలీసులతో పాటు అధికారులకు ముందుస్తు సమాచారం ఉండడంతో స్థానిక ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ అర్ధరాత్రి రెండు గంటల వరకు పోలీసులతో గస్తీ తిరిగారు. ఆ తర్వాత పోలీసులు లేని సమయం చూసి కబ్జారాయుళ్లు ఎక్సకవేటర్ సాయంతో కూలదోసి చదును చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు అరవిందకిషోర్, ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కూల్చివేసిన వారి కోసం ఆరా తీశారు. శ్మశానంలో ఆక్రమణ కోసం కాంపౌండ్‌వాల్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చార్జి ముత్తయ్య పోలీసులను కోరారు.

భార్యాభర్తలపై దాడి

మదనపల్లెఅర్బన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): బసినికొండలో నీళ్ల ట్యాంకు నిర్మాణం పనులు చేస్తున్న భార్యభర్తలపై ప్రత్యర్థులు దాడి చేసి గాయపర్చినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఆదివారం మదనపల్లె మండలం, బసినికొండ పాతూరులో ఉన్న మురళి(41), గాయత్రి(31), కుమార్తె కాలనీకి మంజూరైన నీళ్లట్యాంకు నిర్మాణం పనులు చేస్తుండగా కస్పాకు చెందిన ఆర్టీసీ శంకర, అతని కుమారులు కన్నా, చిన్నా, ఇతరులు పనులు అడ్డుకొని గొడవకు దిగారు. విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చారు. బాధితులను స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. దాడిపై తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆసక్తికరంగా రాయలసీమ స్థాయి క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

లింగాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ స్థాయి బాలికల క్రీడా పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాలలో 14వ తేదీ నుంచి ఈ పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం కబడ్డీలో లక్కిరెడ్డిపల్లె ప్రథమస్థానం, ఆళ్లగడ్డ ద్వితీయస్థానం, త్రోబాల్‌లో వాల్మీకిపురం ప్రథమస్థానం, గురిగుంట ద్వితీయస్థానం, జావెలెన్ త్రోలో పులివెందుల ప్రథమస్థానం, గురగుంట ద్వితీయ స్థానంలో నిలిచాయి. జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ, కోఆర్డినేటర్ నాగవేణి, ప్రిన్సిపల్ సత్యవతమ్మలు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ ఇందిరానగర్‌కు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఈ నెల 12న ఆర్యోగం బాగా లేదని ఆమె ఇంటినుంచి మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి వెళ్లిందని, తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకి తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యాశాఖ వింత నిర్ణయాలకు స్వస్తి పలకాలి

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అనాలోచిత నిర్ణయాలు, తొందరపాటు కార్యక్రమాలకు స్వస్తి పలకాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ వ్యాఖ్యానించారు. ఆదివారం పట్టణంలో జరిగిన యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంత కాలంగా విద్యాశాఖలో జరుగుతున్న విధానాలతో విద్యారంగం నిర్వీర్యం అవుతోందని ఆరోపించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర అలజడి, ఆందోళన నెలకొందన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి ఆమోదం తెలిపినా తిరిగి ఏకపక్ష విధానాలను అమలు చేస్తున్నారన్నారు. శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పి, మళ్లీ నేడు ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే పని సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు సీవీ రమణమూర్తి, దావుద్దీన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గుర్రంకొండ ఏఎస్ఐపై కేసు నమోదు

● అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ ఏఎస్ఐ పి.మోసస్‌పై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు మదనపల్లె పట్టణం ఎస్బీఐ కాలనీలో కాపురం ఉంటున్న మోసస్‌కు 30 ఏళ్ల క్రితం కె.ఎస్తర్ రాణి(55)తో వివాహమైంది. అయితే తన భర్త అదనపు కట్నం కోసం తనను మానసికంగా హింసిస్తున్నాడని ఆమె మదనపల్లె టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలకు తరలిన కూటమి నేతలు



నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియల్లో చంద్రబాబుతో పాటు పాల్గొన్న రైల్వేకోడూరు కూటమి నేతలు

రైల్వేకోడూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు అన్నమయ్య జిల్లా అర్బన్ అథారిటీ ఛైర్మెన్, టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్, కూటమి నేతలు తరలివెళ్లారు. శనివారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం తిరుపతి జిల్లా నారావారిపల్లెలో రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు కూటమి నేతలు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

రామ్మూర్తి నాయుడు మృతి పార్టీకి తీరని లోటు...

రాజంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సోదరుడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతిపట్ల రాజంపేట టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. రాజంపేట పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం ఆధ్వర్యంలో రామ్మూర్తినాయుడు చిత్రపటం వద్ద జోహార్ రామ్మూర్తి నాయుడు అంటూ నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ రామ్మూర్తినాయుడు ఎమ్మెల్యేగా, తాను టీడీపీ ప్రధాన కార్యదర్శిగా కలిసి పని చేశామని గుర్తు చేసుకున్నారు. చిత్తూరు జిల్లాలో సైతం తాను ఏనాడూ సీఎం సోదరుడని అని రాజకీయాలు చేయలేదన్నారు. గొప్ప ఆదర్శాలున్న నారా రామ్మూర్తినాయుడు మృతి తనకు, పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, మండల టీడీపీ నేతలు మేకా నరసింహులు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గుడారు సుబ్రమణ్యం నాయుడు, కంటివైద్య నిపుణులు డాక్టర్ నవీన్, మైనార్టీ నేతలు షామీర్‌బాషా, మాజీ మండలపార్టీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు, టీడీపీ నేతలు దామోదర్‌నాయుడు, జనసేన నేతలు అబ్బిగారి గోపాల్, దగ్గుబాటి రవి, రమణయ్య నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్‌నాయుడుకు పరామర్శ

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ టీడీపీ నేత గన్నే సుదర్శన్‌నాయుడును సుగవాసి పరామర్శించారు. పట్టణంలోని సుదర్శన్ నివాస గృహానికి వెళ్లి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

నారా రామ్మూర్తి నాయుడుకు ఘననివాళులు



రామ్మూర్తినాయుడు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. శనివారం రామ్మూర్తినాయుడు అనారోగ్యంతో మృతిచెందిన విషయం పాఠకులకు విదితమే. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మండల నాయకుడు మాజీ ఎంపీటీసీ యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

'సూపర్ సిక్స్'ను గాలికి వదిలేశారు

- మీడియాతో డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్

రాయచోటిటౌన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): బూటకపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను గాలికి వదిలేసిందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రజలను మభ్యపెట్టి ఎన్నో రకాల హామీలను ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టగానే హామీలను మరిచారన్నారు. మెగా డీఎస్సీ అని చెప్పి కాలయాపన చేస్తూ నిరుద్యోగులను నిలువునా మోసం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం అప్పుల కుప్ప పెడితే టీడీపీ కూటమి ప్రభుత్వం అమలుకు సాధ్యం కానీ హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విజయవంతమైన వైద్యశిబిరం

లక్కిరెడ్డిపల్లెనవంబరు17(ఆంధ్రజ్యోతి): ధన్వినారాయణ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని నిర్వాహకులు తెలిపారు. మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నలంద హైస్కూల్‌లో నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రావణి, స్వాతిరెడ్డి, జానకీరాం, భువనేశ్వరి, ప్రసాద్ బాబు, హరిశ్రీ షుగర్, బీపీ, కీళ్లు, కండరాళ్లు, స్త్రీల, వైద్యం, చిన్నపిల్లలకు, ఎముకలు, డెంటల్, లాపరోస్కోపిక్ పరీక్షలు చేశారు. శిబిరంలో 378 మందికి రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మానవత వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి, చైర్మెన్ బాలసుబ్రమణ్యం, ప్రసాద్ యాదవ్, శివశంకర్‌రెడ్డి, డాక్టర్ షిఫీ నాయక్, సుబ్బారెడ్డి, రమణారావు, చైతన్యరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ముమ్మరంగా సభ్యత్వాల నమోదు

50 వేల సభ్యత్వాలు అధిగమించిన వైనం ● లక్ష వైపుగా వడివడిగా నడక ● టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం

రాజంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజ కవర్గంలో 50 వేల పైచిలుకు సభ్యత్వాలు పూర్తి చేసుకుని లక్ష సభ్యత్వాల వైపునకు వడివడిగా అడుగులు పడుతున్నాయని రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం రాజంపేటలో టీడీపీ సభ్యత్వాల నమోదుపై ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కొన్ని అనివార్య కారణాలతో పార్టీ ఓటమి చెందినా సభ్యత్వాల విషయంలో అనతికాలంలోనే రికార్డు స్థాయిలో 50 వేల పైచిలుకు సభ్యత్వాలు పూర్తి చేసిందని వివరించారు. ఏప్రిల్ వరకు టీడీపీ సభ్యత్వాలు చేసుకునే వెసులుబాటున్నా 15 రోజుల్లోనే 50 వేల సభ్యత్వాలు దాటిందన్నారు. నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తల కృషి, వారి తోడ్పాటుతో ఈ లక్ష్యాన్ని సాధించగ లిగానన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా తనకు 60 వేల సభ్యత్వాలు టార్గెట్ ఇచ్చినా లక్ష్యాన్ని వెను వెంటనే సాధించామన్నారు.



టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న సుగవాసి బాలబస్రుమణ్యం

టీడీపీతోనే రాష్ట్రం అభివృద్ధి

సిద్దవటం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతంగా జరుగుతోందని రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి శ్రీనివాసులు నాయుడు తెలియజేశారు. సభ్యత్వ నమోదులో భాగంగా ఆదివారం బెటాలియన్ వద్ద ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో మండల పరిధిలో పలు గ్రామాల్లో విజయవంతంగా జరుగుతోందన్నారు. నియోజకవర్గస్థాయిలో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావడం సంతోషకరమన్నారు. సర్పంచ్ తుర్ర ప్రతాప్ నాయుడు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండ

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యకర్తలకు అండగా ఉంటుందని మండల నేత, మాజీ ఎంపీటీసీ యనమల మదన్ మోహన్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై ఆయన మాట్లాడుతూ గ్రామ నేతల సహకారంతో సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలన్నారు. ఇప్పటికీ 7వేలపైచిలుకు పార్టీ సభ్యత్వాలు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, హేమంత్ ముక్తార్‌అహ్మద్, మల్లికార్జున, సుధీర్, జనార్ధన్‌రెడ్డి, మూగి వెంకటరమణ పాల్గొన్నారు.

సూర్యనారాయణపురంలో...

రామాపురం, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కసిరెడ్డిగారిపల్లెలో ఆదివారం టీడీపీ నేతల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నందలూరులో...

నందలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వంతో టీడీపీ కుటుంబ సభ్యులకు చంద్రబాబు ఒక భరోసా అని టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి పసుపులేటి ప్రవీణ్‌కుమార్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ అన్నారు. నాగిరెడ్డిపల్లెలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు సూచనపై సభ్యత్వ నమోదు చేస్తున్నామన్నారు. 'పార్టీలో చేరుదాం రాష్ట్ర భవిష్యత్‌ను మారుద్దాం' నినాదంతో ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు.

రోడ్డు పనికి కుంటమట్టి

కదిరేకుంట రోడ్డు పనిలో నాణ్యతకు గోవింద ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ



కదిరే కుంటలో ఎక్స్‌కవేటర్‌తో తోలుతున్న మట్టి

సంబేపల్లె, నవంబరు17(ఆంధ్రజ్యోతి): కదిరే కుంట రోడ్డు పనులకు కుంట మట్టి తోలారు. పనులు ఈమట్టితోనే సాగితే నాణ్యతకు తిలోదకాలు ఇచ్చినట్లే. ఇక్కడ పనులపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఖర్చు తక్కువని కుంట మట్టి తోలారు. ఈ తంతు మూడు రోజులుగా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. వివరాల్లోకెళితే....

కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలకు సిమెంటు రోడ్లు మంజూరయ్యాయి. మండలంలో హరిజనవాడ నుంచి బొగ్గులవారిపల్లె వరకు, బొగ్గులవారి పల్లె నుంచి ఊటుపాలెం మీదుగా అంబేద్కర్ నగర్ హరిజనవాడ వరకు ఒక్కో పనికి రూ.50 లక్షలు చొప్పున రెండు పనులకు కోటి రూపాయలు మంజూరైంది. రోడ్డు పనుల్లో గ్రావెల్ (ఎర్రమట్టి) తోలాలి. అయితే కుంట దగ్గరగా ఉందని, ఖర్చు తక్కువ అవుతుందని కుంట మట్టి తోలారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఈ తంతు మూడు రోజులుగా జరుగుతోంది. కుంటల్లో, చెరువుల్లో మట్టి కేవలం రైతుల పొలాల్లో సారవంతం కోసం మాత్రమే తోలుకోవాలి తప్ప మిగిలిన పనులకు వినియోగించరాదు. అయితే అడిగేవాడు లేకపోతే తోలుకున్న వాడికి తోలుకున్నంత అన్న సామెతగా మారిపోయింది. మండలంలో చాలా చోట్ల మట్టి తోలి బొరియలు చేశారు. ఇరిగేషన్ అధికారులు మట్టి అక్రమణ తరలింపుపై విచారించి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కదిరేకుంట కుంట మట్టి అక్రమ తరలింపుపై తహసీల్దార్ వెంకటేశులును వివరణ కోరగా వెంటనే ఆర్ఐ, వీఆర్‌ఓలను పంపి మట్టి తరలింపు నిలుపుదల చేయాలని ఆదేశించారు. అక్రమ మట్టి తరలింపును అడ్డుకున్నారు.



రోడ్డుకు తోలిన కుంట మట్టి

రైల్వేకోడూరులో భారీ వర్షం

రైల్వేకోడూరు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పలు వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. జనాలు ఇక్కట్లు పడ్డారు. ఐదు రోజులుగా వర్షం కురుస్తూనే ఉండడంతో కూలీలు పలురకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిషత్ ఆవరణలో వర్షపు నీరు చేరింది. అటు వెళ్లే జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పెనగలూరులో....

పెనగలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అప్పుడప్పుడు కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఆదివారం మధ్యాహ్నం చక్రంపేట, పొందలూరు, కాకర్లవారిపల్లె తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి అక్కడక్కడ మరికొన్ని ప్రాంతాల్లో జల్లులతో కూడిన వర్షంతో పాటు మోస్తారు వర్షం కురిసింది.



జలమయమైన రైల్వేకోడూరు ప్రధానదారి

వేడుకగా అంబుళం పూజ

సుండుపల్లె, నవంబరు17(ఆంధ్రజ్యోతి): విరూపాక్ష స్వామి, శివాలయం ఆవరణలో అయ్యప్పస్వామి అంబుళం పూజ వేడుకగా చేశారు. శనివారం రాత్రి శివాలయంలో వినాయకనగర్‌కు చెందిన మేస్త్రీ వెంకట్రమణ కుటుంబ సభ్యులు పూజను ఏర్పాటు చేశారు. అరటి బెరడుతో చేసిన మందిరాల్లో వినాయక, అయ్యప్ప, సుబ్రమణ్యంస్వామి విగ్రహాలు ఏర్పాటు పూలతో అలంకరించారు. గురుస్వామి నాగరాజస్వామి కలశ పూజ చేశారు.

అడా చెర్మన్ రూపానందరెడ్డి రాక

పెనగలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సోమవారం మండలానికి వస్తున్నారు. తూర్పుపల్లె వద్ద బోడమల్లేశ్వరస్వామి, జెట్టివారిపల్లె సమీప నాగలింగేశ్వరస్వాములను దర్శించుకోనున్నారని టీడీపీ బీసీసెల్ మండల అధ్యక్షుడు కోడూరు వెంకటయ్య, టీడీపీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు కురుముట్ల వెంకటసుబ్బయ్య తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రెండు శైవక్షేత్రాలను రూపానందరెడ్డి దర్శించుకోనున్నారన్నారు.

పుల్లంపేటలో రక్తదాన శిబిరం

పుల్లంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో భజరంగ్‌దళ్ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వంద మంది కార్యకర్తలు, యువకులు రెడ్‌క్రాస్ సొసైటీకి రక్తదానం చేశారు. అయోధ్యరామ మందిరం త్యాగమూర్తులను స్మరించుకుంటూ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, మండల అధ్యక్షుడు సుధాకర్ బాబు, నరసింహప్రసాద్, జయసింహ, సాధు సుబ్బరాయుడు, పెంచల్ రెడ్డి, మనోహర్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌రాజు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న దృశ్యం

25 నుంచి 108 ఉద్యోగుల నిరవధిక సమ్మె

● సీఐటీయూ నేత రామాంజులు

రాయచోటిటౌన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): 108 ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం 25 నుంచి సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా రామాంజులు ప్రకటించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలోని 108 ఉద్యోగుల సమావేశం జరిగింది. 108 వాహనాలను నిర్వహించే ప్రతి ప్రైవేట్ యాజమాన్యం ఇయంట్, ఫైలట్ల గ్రాట్యూటీ ఎరండ్ లీవ్ అమౌంట్ వార్షిక ఇక్రిమెంట్‌లు చెల్లించకుండా వైదొలగడంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వమే 108 సర్వీసులను నిర్వహించాలన్నారు. 108 సిబ్బందికి 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సహజ మరణం చెందిన వారికి రూ.20 వేలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, పీఎఫ్ సొమ్ము మొత్తాన్ని యాజమాన్యం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు రెస్ట్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం సర్వీస్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్‌ను సీఐటీయూ అనుబంధంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, ప్రధాన కార్యదర్శి, బీవీ చలపతి, కోశాధికారి యోగానందరెడ్డి, మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. 108 ఉద్యోగులు యర్రన్న, జయరాం, శివానందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ప్రసాద్, దామోదర, బ్రహ్మానందరెడ్డి, ఆజ్మ తుల్లాబేగ్, చంద్రమౌళి, రహంతుల్లా, అమర్‌నాద్ బాబు, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన 108 ఉద్యోగులు

20 నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవం

సంబేపల్లె, నవంబరు17(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు వీరాంజనేయస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవం నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు తాతిరెడ్డి వినితారెడ్డి వెంకట్రామరెడ్డి పేర్కొన్నారు. పేరంపల్లిగారిపల్లె సమీపంలో వెలిసిన వీరాంజనేయ, గణపతి, శిరిషిడిసాయి, వాయులింగేశ్వర ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. 20న ప్రత్యేక పూజలు హోమం, రాత్రి అయ్యప్పస్వాముల అంబుళంపూజ, 21న సత్యనారాయణ వ్రతం, మహాశివునికి మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, రాత్రి శివతాండవం, ఆనందతాండవం నృత్య ప్రదర్శన, 22న మహా పూర్ణాహుతి సీతారాముల వారి శాంతి కల్యాణం వీరాంజనేయస్వామి విజయ, గణపతి, శిరిడి సాయిబాబా, వాయులింగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రాజంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాయినగర్ సాయిబాబా ఆలయంలో ధర్మకర్తల ఆధ్వర్యంలో 25వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయినాధుని ప్రత్యేకంగా అలంకరించి భజన, సాంస్కృతిక కార్యక్రమాలను చేశారు. సాయినాధునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. సాయినగర్‌లో ఆలయం నిర్మించి 25 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా అన్నదానం నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నదానం ప్రారంభించారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకున్న హోంగార్డు కమాండెంట్ ఎస్పీ మహేష్‌కుమార్

లక్కిరెడ్డిపల్లెనవంబరు17(ఆంధ్రజ్యోతి): అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మతల్లికి కార్తీకమాసం పురస్కరించుకుని ఆదివారం కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా కార్తీక దీపాలంకరణతో వెలిగింది మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో రాయలసీమ జోన్ హోంగార్డు కమాండెంట్ ఎస్పీ మేకల మహేష్‌కుమార్ అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. అలయ చైర్మెన్ రెడ్డెయ్య, ఆలయ ఈఓ శ్రీనివాసులు, అర్చకులు సాదరంగా ఆహ్వానించి పూజలు నిర్వహించారు.

అయ్యప్ప భక్తులకు అల్పాహారం అందజేత



అయ్యప్ప భక్తులకు అల్పాహారం అందజేస్తున్న దృశ్యం

నందలూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు నుంచి శబరిమలకు పాదయాత్రగా వెళుతున్న అయ్యప్ప మాలధారణ భక్తబృందం ఆదివారం నందలూరుకు చేరుకోగా ఎస్ఐ మన్నెం రామ్మోహన్, మన్నెం దేవి దంపతులు భక్తబృందం వారికి అల్పాహార వితరణ చేశారు. అనారోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి ఈగ మధుసూదన్‌రెడ్డి వారికి మందులు అందజేశారు.

19 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): స్థానిక లయన్స్ కంటి ఆస్పత్రిలో ఆదివారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 19 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, యర్రావారిపల్లెం, కేవీపల్లి, కలకడ, కలికిరి, గుర్రంకొండ, పెద్దమండ్యెం, కదిరి, ఎన్‌పీకుంట, చక్రాయపేట నుంచి వచ్చిన40 మందికి పరీక్షలు నిర్వహించారు. అందులో అర్హులైన 19 మందికి ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆరేషన్ చేయించుకున్న 35 మందిని పరీక్షించి అద్దాలు, మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి చైర్మెన్ వైవీ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చెన్నూరు అన్వర్‌బాషా, ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, భార్గవి పాల్గొన్నారు.

వెల్లివిరిసిన మత సామరస్యం

● అయ్యప్ప మాలధారులకు ముస్లింల అన్నదానం



అయ్యప్ప భక్తులకు అన్నదానం చేస్తున్న సంస్థ సభ్యులు

మదనపల్లెఅర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో మతసామరస్యం వెల్లివిరిసేలా హెల్పింగ్ మైండ్స్ నిర్వాహకులు అబూబకర్ సిద్దిక్, తన సభ్యులతో కలిసి ఆదివారం అయ్యప్ప మాలధారులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా మతసామరస్యంతో సోదర భావాన్ని పెంపొందిస్తూ పవిత్ర అయ్యప్పస్వామి మాలధారులకు స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో భిక్షను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొదటగా అయ్యప్ప చిత్రపటానికి పూజ నిర్వహించి, హారతి ఇచ్చిన అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, ఆబిద్, మొఖద్దర్, ముఫీ, హనీఫ్, సమీర్, పవన్, సాయిదీపక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపిన కొండచిలువ




ప్రజలు కొట్టిచంపిన కొండచిలువ

కాశినాయన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నర్సాపురం తహసీల్దారు కార్యాలయం ముందు ప్రధాన రహదారిపై శనివారం రాత్రి కొండచిలువ కనిపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. నిత్యం రాత్రి పది గంటల వరకు ప్రజలు రాకపోకలు సాగించే ఈ రోడ్డులో కొండ చిలువ దర్శనమివ్వడం కలకలం రేపింది. తహసీల్దారు కార్యాలయ పరసరాల నుంచి సమీపంలోని ముళ్ల కంపలోకి రోడ్డుదాటుకొని వెళ్లే సమయంలో ప్రజల కంటపడింది. గమనించిన పాదచారులు చుట్టుపక్కల వారికి తెలియజేయడంతో అందరూ కలిసి కర్రలతో కొట్టిచంపారు. దాదాపు రెండు మీటర్లకు పైగా పొడవు ఉన్న ఈ కొండచిలువ తక్కువ వయస్సు కల్గి ఉందని, ఎక్కడి నుంచి వచ్చిందో అంతుబట్టడం లేదని స్థానికులు అంటున్నారు.

గత పాలకుల నిర్ణయం డీసీఎంఎస్‌కు శాపం

● ఐదేళ్లలో రూ.6 కోట్ల నష్టం
● అందని కమీషన్లు
● అయోమయంలో అధికార యంత్రాంగం



కడప ఎన్టీఆర్‌సర్కిల్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) నష్టాల్లో కూరుకుపోతోంది. రైతులకు అవసరమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు సర్కారు చేసే బాధ్యతను కొన్ని దశాబ్దాల కాలంగా చేపడుతూ వచ్చేది. అయితే గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడంతో అప్పటి నుంచి రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంది. ఉన్న వ్యాపారం చేజారిపోవడంతో డీసీఎంఎస్ మనుగడ కోల్పోయే పరిస్థితి నెలకొంది. అప్పుడప్పుడూ ఇతర వ్యాపారాలు చేస్తున్నప్పటికీ ప్రైవేటు వ్యాపారుల ముందు పోటీకి తట్టుకోలేక వ్యాపారాలు చేయలేక దిక్కులు చూడడం డీసీఎంఎస్ అధికారుల వంతైంది. ఈ క్రమంలో గతంలో చేసిన వ్యాపారాల ద్వారా ఆశించిన లాభాలను బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వాటిపై వచ్చే వడ్డీలతో, గదులు, స్థలాలపై వచ్చే అద్దెలతో సిబ్బంది జీతాలు పొందుతున్న పరిస్థితి నెలకొంది.

ఐదేళ్లలో రూ.6 కోట్లు నష్టం

వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లలో డీసీఎంఎస్ సుమారు రూ.6 కోట్లు నష్టాన్ని చవి చూడాల్సి వచ్చిందని సమాచారం. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో ప్రభుత్వాలు ఇచ్చే రాయితీలు విత్తనాలు, ఎరువులు రైతులకు విక్రయించడం ద్వారా ఏడాదికి దాదాపు కోటి రూపాయలు ఆదాయం సమకూరేది. వీటి విక్రయాల బాధ్యత పూర్తిస్థాయిలో రైతు భరోసా కేంద్రాలకు అప్పగించడంతో గడిచిన ఐదేళ్ల కాలంలో సుమారు ఐదారు కోట్ల రూపాయల వ్యాపారం కోల్పోయింది. గతంలో లాగా విత్తనాలు ఎరువుల విక్రయాలు ఉంటే సంస్థలోని సిబ్బందికి డీసీఎంఎస్ రైతు వినిమయ కేంద్రాల్లో పని దొరికేది. ఆ వ్యాపారం లేకపోవడంతో సిబ్బందికి కూడా తగినంత పనిలేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ అంశంపై గతంలో ఉన్న పాలకవర్గాలు కూడా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురాలేకపోవడంతో డీసీఎంఎస్‌లకు నష్టాలు తప్పలేదు. సహకారరంగం ఏర్పడిందే రైతులకు సేవలు అందించేందుకు అని చెబుతుంటారు. కానీ ప్రభుత్వ పాలసీ ఇందుకు విరుద్ధంగా అమలైనా అడిగే వారు లేకపోవడంతో ప్రభుత్వ నిర్ణయం డీసీఎంఎస్‌కు శాపంగా మారింది. ఇదివరకు కొనసాగిన పాలకవర్గాలు కూడా ఇతర వ్యాపారాలు, సరఫరా పనులకు కాంట్రాక్టు తేవడంలో కూడా సరైన చొరవ చూపెట్టక పోవడంతో సంస్థ నష్టాల బాటలో నడుస్తుందనే చర్చ సాగుతోంది.

అందని కమీషన్లు

చేసిన పనికి సకాలంలో కమీషన్లు అందకపోవడంతో డీసీఎంఎస్ పరిస్థితి మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా తయారైంది. విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేపట్టడంతో నష్టపోతున్న డీసీఎంఎస్‌కు రైతు ఉత్పత్తులను సేకరించడం ఒక ఆదాయ వనరుగా ఏర్పడింది. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం ఏపీ మార్క్‌ఫెడ్, పౌరసరఫరాల సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసేవారు. ఈ క్రమంలో డీసీఎంఎస్ చేసిన పనికి కొంతమేర కమీషన్ ఇచ్చేవారు. ఈ తరుణంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా దాదాపు రూ.రెండున్నర కోట్ల వరకు డీసీఎంఎస్‌కు రావాల్సి ఉందనేది సమాచారం. అదే విధంగా పౌరసరఫరాల సంస్థ నుంచి దాదాపు రూ.70 లక్షలు అందాలని తెలుస్తోంది. వీటికి సంబంధించిన బకాయిలు వసూలైతే కొంత మేర ఊరట కలిగే అవకాశం ఉంది. నిధులు లేకపోవడంతో సిబ్బందికి తగినన్ని విధులు లేనట్లు తెలుస్తోంది. ఒక పక్క ప్రభుత్వానికి సంబంధించిన విద్య ఇన్‌స్టిట్యూట్లకు అవసరమైన సామగ్రిని సరఫరా చేసేందుకు కాంట్రాక్టు కోసం ప్రయత్నిస్తూ ఉన్నప్పటికీ అందిన పరిస్థితి లేదు. ఐసీడీఎస్‌కు, కస్తూర్బా స్కూళ్లకు అవసరమైన నిత్యావసర వస్తువులు, ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన స్టేషనరీని సరఫరా అవకాశం ఉన్నప్పటికీ అందుకు తగిన అవకాశాలు దక్కకపోవడంతో డీసీఎంఎస్ అధికార యంత్రాంగం అయోమయంలో ఉంటుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఐఏఎస్ అధికారులకు ప్రత్యేక అధికారి బాధ్యతలు ఇచ్చారు. అంతేకాకుండా దిశ నిర్దేశం చేసేందుకు సహకార శాఖ నుంచి ఒక సీనియర్ అధికారికి డీసీఎంఎస్ పనితీరుపై పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారి చొరవతో వివిధ శాఖలకు సంబంధించిన వస్తువుల సరఫరా బాధ్యతలు డీసీఎంఎస్‌కు అందుతాయని అధికారులు, సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రైతుభరోసా కేంద్రం

కమీషన్ల వసూళ్లకు ప్రయత్నిస్తున్నాం

- ఖాదర్‌వల్లి, ఇన్‌చార్జ్ బిజినెస్ మేనేజరు, డీసీఎంఎస్

ఏపీ మార్క్‌ఫెడ్ సివిల్ సప్లై నుంచి దాదాపు రూ.మూడు కోట్లు కమీషన్లు రావాల్సి ఉంది. వాటి వసూళ్ల కోసం రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో మాట్లాడుతున్నాం. ప్రభుత్వ శాఖలకు అవసరమైన స్టేషనరీ, సామగ్రి సరఫరా పనులు దక్కితే మరింత బాగుంటుంది.

గొలుసు దొంగల అరెస్టు

● రూ. 30 లక్షల నగలు, మోటార్‌సైకిళ్ల స్వాధీనం



చైన్‌స్నాచర్లను చూపుతున్న ఎస్పీ మణికంఠ తదితరులు

పలమనేరు, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఒంటరి మహిళలకు కునుకు లేకుండా చేస్తున్న చైన్ స్నాచర్లను పోలీసులు అరెస్టు చేశారు.ఇటీవల గొలుసు దొంగతనాలు బాగా పెరిగిన విషయం తెలిసిందే. మహిళలకు బయటికెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.ఈ నేపథ్యంలో 8మంది చైన్ స్నాచర్లను అరెస్టు చేసి రూ. 30 లక్షలకు పైగా విలువ చేసే బంగారు నగలు, మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు.పలమనేరు డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఎస్పీ మణికంఠ వివరాలను వెల్లడించారు. పుంగనూరులో ఈనెల 1వతేది ఓ మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లారు.పుంగనూరు ఆర్టీసీ డిపోలో పనిచేసే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి బుక్యాప్రసాద్‌నాయక్ ఈనెల 15వతేది పుంగనూరు మినీ బైపాస్ రోడ్డుపై వెళ్తున్న ఓ మహిళ మెడలోనుంచి చైన్ లాక్కెళ్తుండగా స్థానికులతో కలిసి పుంగనూరు సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ లోకేష్ వెంబడించారు. అతడిని అరెస్టు చేసి రూ.6.50 లక్షల విలువైన 69 గ్రాముల మూడు బంగారు చైన్లు, ఒక మోటరు సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.లోన్ యాప్‌లో రుణాలు తీసుకొని చెల్లించలేక ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. కొద్ది రోజులుగా చౌడేపల్లి, గంగవరం, కురబలకోట, రామసముద్రం, పలమనేరు, శాంతిపురం, బైరెడ్డిపల్లి మండలాల్లో ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలో బంగారు గొలుసులను లాక్కెళ్లిన ఏడుగురిని అరెస్టు చేసి చైన్లను స్వాధీనం చేసుకున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లి మండలం ఏటిగడ్డపల్లికి చెందిన ముద్దం చంద్రశేఖర్(32), హరికృష్ణ(24), మదనపల్లెకు చెందిన దాసరి నాగరాజు అలియాస్ నాగ (38), ఎల్.భాస్కర్(37),కె. పవన్‌కుమార్(27) బి.కొత్తకోటకు చెందిన పి.బావాజాన్ (35), చౌడేపల్లి మండలం మదుకూరుకు చెందిన గుంతలపేట లక్ష్మీపతి అలియాస్ చంటి(30) అరెస్టు అయిన వారిలో వున్నారు. వీరి వద్ద చోరీ చేసిన 332 గ్రాముల బంగారు ఆభరణాలు, దొంగతనాలకు ఉపయోగించిన మూడు మోటరు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ మణికంఠ తెలిపారు. డీఎస్పీ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో చైన్‌స్నాచర్స్‌ను అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన ఏఎస్‌ఐ శ్రీనివాసులు నాయుడు, కానిస్టేబుళ్లు అల్లావుద్దీన్, శశిధర్, బాలాజి, రెడ్డెప్ప, వెంకటరమణ, ఎల్లప్పలకు రివార్డులను ఎస్పీ అందజేశారు.అలాగే గొలుసులను పోగొట్టుకున్న బైరెడ్డిపల్లి మండలం రామసముద్రం గ్రామానికి చెందిన అలివేలుతో పాటు మరో ఇద్దరు మహిళలకు బంగారు చైన్లను ఎస్పీ మణికంఠ అందజేశారు.

వృద్ధురాలిపై పంది దాడి



తీవ్రంగా గాయపడ్డ వృద్ధురాలు

చెన్నూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు శ్రీరామ్‌నగర్‌కు చెందిన బొర్రా నాగమ్మ (75) అనే వృద్ధురాలిపై పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇటీవల కాలంలో చెన్నూరు వ్యాప్తంగా పందుల సంచారం ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధురాలిని ఒక్కమారుగా పంది దాడి చేయడంతో కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా మారడంతో ఆ వృద్ధురాలిని స్థానికంగా ఉన్న ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి అనంతరం కడపకు తీసుకెళుతున్నట్లు బంధువులు తెలిపారు. కాగా పందుల సంచారంపై పలుమార్లు స్థానిక పంచాయతీలో ఫిర్యాదు చేయడం, కార్యదర్శి పోలీసు సిబ్బందితో వాటిని పట్టించినా స్థానికంగా ఉన్న కొందరు నేతలు పట్టుబడిన పందులను మేపేవారి కోరిక మేరకు మరలా వాటిని కొంత దూరం వెళ్లాక బయటికి వదిలేయడం జరుగుతుంది. దీంతో పందుల సంఖ్య పెరగడమే తప్ప తగ్గడం లేదు. ఈ విషయంపై తక్షణం చర్యలు తీసుకోవాలని పందుల సంచారం లేకుండా నిర్మూలించాలని అన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



లభ్యమైన గణేశ్ మృతదేహం

వల్లూరు, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం పుష్పగిరి పెన్నానదిలో గల్లంతైన రెడ్డిపల్లె గణేశ్ (27) మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. ఫైర్ సిబ్బంది, స్థానిక గజ ఈతగాళ్ల సాయంతో శుక్ర, శని వారాల్లో నదిలో వెతికిన విషయం పాఠకులకు విదితమే. కాగా ఆదివారం సిద్దవటం మండలం లింగంపల్లె పెన్నానది ఒడ్డున మృతదేహం బయటపడినట్లు ఏఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

భార్యను కత్తితో పొడిచిన కేసులో నిందితుడి అరెస్ట్

● 14 రోజుల రిమాండ్

కాశినాయన, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బాలరాజుపల్లె గ్రామంలో గత శుక్రవారం భార్య సుబ్బలక్ష్మమ్మను కత్తితో పొడిచిన కేసులో దాడికి పాల్పడిన భర్త బసిరెడ్డి రామిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ హనుమంతు తెలిపారు. బాధితురాలు సుబ్బలక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామిరెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి ఆదివారం బద్వేల్ కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారన్నారు.

శ్మశాన స్థలం కబ్జా

● తెల్లవారుజామున ప్రహరీ కూల్చివేత
● పోలీసులకు సర్పంచ్ ఫిర్యాదు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు, ఎస్‌ఐ

పుల్లంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేటలో కబ్జారాయుళ్లు రెచ్చిపోతున్నారు. పోలీసులకు ముందస్తు సమాచారం ఉన్నా అర్ధరాత్రి రెండు గంటల వరకు కాపుగాసిన కూడా కబ్జారాయుళ్లు బెదరలేదు. పుల్లంపేట పోలీసుస్టేషనుకు అతి దగ్గరలో ఉన్న పుల్లంపేట శ్మశానానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్ కూల్చి పోలీసులకు సవాల్ విసిరారు. పుల్లంపేట టౌన్‌లో తహసీల్దారు కార్యాలయానికి ఆనుకుని ఉన్న సర్వేనంబరు 280లో 6.20లో తోపు పొరంబోకు భూమి ఉంది. ఏడాది క్రితం రూ.5 లక్షల జడ్పీ నిధులతో కొంతమేర కాంపౌండ్‌వాల్‌ను నిర్మించారు. శ్మశానానికి నిర్మించిన కాంపౌండ్‌వాల్‌ను కూల్చివేసి ఆక్రమణ చేస్తున్నారని పోలీసులతో పాటు అధికారులకు ముందుస్తు సమాచారం ఉండడంతో స్థానిక ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్ అర్ధరాత్రి రెండు గంటల వరకు పోలీసులతో గస్తీ తిరిగారు. ఆ తర్వాత పోలీసులు లేని సమయం చూసి కబ్జారాయుళ్లు ఎక్సకవేటర్ సాయంతో కూలదోసి చదును చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు అరవిందకిషోర్, ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కూల్చివేసిన వారి కోసం ఆరా తీశారు. శ్మశానంలో ఆక్రమణ కోసం కాంపౌండ్‌వాల్‌ను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చార్జి ముత్తయ్య పోలీసులను కోరారు.

ఆసక్తికరంగా రాయలసీమ స్థాయి క్రీడాపోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

లింగాల, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ స్థాయి బాలికల క్రీడా పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. మండలంలోని ఇప్పట్ల గురుకుల కళాశాలలో 14వ తేదీ నుంచి ఈ పోటీలు జరుగుతున్నాయి. ఆదివారం కబడ్డీలో లక్కిరెడ్డిపల్లె ప్రథమస్థానం, ఆళ్లగడ్డ ద్వితీయస్థానం, త్రోబాల్‌లో వాల్మీకిపురం ప్రథమస్థానం, గురిగుంట ద్వితీయస్థానం, జావెలిన్ త్రోలో పులివెందుల ప్రథమస్థానం, గురగుంట ద్వితీయ స్థానంలో నిలిచాయి. జిల్లా ఇన్‌చార్జి ఉదయశ్రీ, కోఆర్డినేటర్ నాగవేణి, ప్రిన్సిపల్ సత్యవతమ్మలు పాల్గొన్నారు.

భార్యాభర్తలపై దాడి

మదనపల్లెఅర్బన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): బసినికొండలో నీళ్ల ట్యాంకు నిర్మాణం పనులు చేస్తున్న భార్యభర్తలపై ప్రత్యర్థులు దాడి చేసి గాయపర్చినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఆదివారం మదనపల్లె మండలం, బసినికొండ పాతూరులో ఉన్న మురళి(41), గాయత్రి(31), కుమార్తె కాలనీకి మంజూరైన నీళ్లట్యాంకు నిర్మాణం పనులు చేస్తుండగా కస్పాకు చెందిన ఆర్టీసీ శంకర, అతని కుమారులు కన్నా, చిన్నా, ఇతరులు పనులు అడ్డుకొని గొడవకు దిగారు. విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చారు. బాధితులను స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. దాడిపై తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణ ఇందిరానగర్‌కు చెందిన ఓ మహిళ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఈ నెల 12న ఆర్యోగం బాగా లేదని ఆమె ఇంటినుంచి మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రికి వెళ్లిందని, తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకి తెలియకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యాశాఖ వింత నిర్ణయాలకు స్వస్తి పలకాలి

● యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

రాయచోటిటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అనాలోచిత నిర్ణయాలు, తొందరపాటు కార్యక్రమాలకు స్వస్తి పలకాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ వ్యాఖ్యానించారు. ఆదివారం పట్టణంలో జరిగిన యూటీఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ కొంత కాలంగా విద్యాశాఖలో జరుగుతున్న విధానాలతో విద్యారంగం నిర్వీర్యం అవుతోందని ఆరోపించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల్లో తీవ్ర అలజడి, ఆందోళన నెలకొందన్నారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరిపి ఆమోదం తెలిపినా తిరిగి ఏకపక్ష విధానాలను అమలు చేస్తున్నారన్నారు. శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ తరగతులు ఉంటాయని చెప్పి, మళ్లీ నేడు ప్రధానోపాధ్యాయులకు ఆరు రోజులు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే పని సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపుతోందని, అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలిపోయాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు సీవీ రమణమూర్తి, దావుద్దీన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ సురేంద్రారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

గుర్రంకొండ ఏఎస్‌ఐపై కేసు నమోదు

● అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ ఏఎస్‌ఐ పి.మోసస్‌పై కేసు నమోదు చేసినట్లు మదనపల్లె టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. ఆయన వివరాల మేరకు మదనపల్లె పట్టణం ఎస్బీఐ కాలనీలో కాపురం ఉంటున్న మోసస్‌కు 30 ఏళ్ల క్రితం కె.ఎస్తర్ రాణి(55)తో వివాహమైంది. అయితే తన భర్త అదనపు కట్నం కోసం తనను మానసికంగా హింసిస్తున్నాడని ఆమె మదనపల్లె టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

ప్రైవేటు వాహనాలదే హవా

- వాల్మీకిపురం-నిమ్మనపల్లె మధ్య కనిపించని ఆర్టీసీ బస్సు సర్వీసు
- పదేళ్లకు పైగా రాజ్యమేలుతున్న ఆటోలు, ప్రైవేట్ వాహనాలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామీణ ప్రజలు



వాల్మీకిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం-నిమ్మనపల్లె మార్గంలో ప్రైవేటు వాహనాల హవా పెరిగిపోతోంది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్టీసీ బస్సు సర్వీసు దాదాపుగా 12ఏళ్లుగా కనుమరుగైనా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవ ం శోచనీయం. ప్రైవేటు వాహనాలతో గ్రామీణ ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. వాల్మీకిపురం నుంచి నిమ్మనపల్లెకు గత పదేళ్ల కిందటి దాకా ఆర్టీసీ బస్సు నడిచేది. అయితే ప్రైవేట్ బస్సులు ఏర్పాటు చేసి ఆర్టీసీ ఆదాయానికి గండి కొట్టడం తదితర కారణాలతో ఆర్టీసీ బస్సు సర్వీసును రద్దు చేశారు. కాలక్రమేణా ఉన్న ప్రైవేట్ బస్సు కూడా ఎత్తివేయడంతో నిత్యం ఈ ప్రాంతం గుండా ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రస్తుతం వాల్మీకిపురం నుంచి నిమ్మనపల్లెకు వెళ్లాలంటే ఆటోలే శరణ్యంగా మారాయి. అయితే పర్మిట్లు లేని కొన్ని వాహనాలు అడపాదడపా ఈ మార్గంలో దర్శనమిస్తుండడం గమనార్హం. ప్రస్తుతం ఓ ప్రైవేట్ మినీ బస్సు వాల్మీకిపురం నుంచి నిమ్మనపల్లెకు నడుస్తోంది. అదికూడా ఒకరోజు ఉంటే మరోరోజు అందుబాటులో ఉండడం లేదని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. నిమ్మనపల్లె నుంచి వాల్మీకిపురంకు వచ్చే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు అందరూ కూడా ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సి వస్తోంది. ప్రైవేట్ వాహనాలలో వాల్మీకిపురం-నిమ్మనపల్లెకు రూ.30 టిక్కెట్లు వసూలు చేస్తున్నారని అయినా అత్యవసర సమయాన వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకుని వాల్మీకిపురం-నిమ్మనపల్లె మార్గంలో గతంలో ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీసును పునరు ద్ధరించాలని కోరుతున్నారు.

బస్సు రద్దయి పదేళ్ల పైమాటే..



వాల్మీకిపురం-నిమ్మనపల్లె మార్గంలో ఆర్టీసీ బస్సు రద్దు చేసి పదేళ్లకు పైగా అయింది. ప్రైవేట్ వాహనాలు తిరుగుతున్నాయే తప్ప గ్రామీణ ప్రజలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసును తిరిగి ఏర్పాటు చేస్తేమేలు.

-విజయ్‌కుమార్‌రెడ్డి, ఫత్తేపురం, వాల్మీకిపురం

ప్రైవేటు వాహనాలతో ఇబ్బందులు



నిమ్మనపల్లె నుంచి వాల్మీకిపురంకు పోవాలంటే బస్సు సౌకర్యం లేదు. ప్రైవేట్ వాహనాలు కూడా ఒక రోజు ఉంటే ఒకరోజు ఉండవు. ఆటోలే దిక్కుగా మారాయి. అధికారులు మా ఊరికి ఆర్టీసీ బస్సు నడిపితే మాకు అనుకూలంగా ఉంటుంది.

-రమణమ్మ, గుర్రెడ్డిగారిపల్లె, నిమ్మనపల్లె

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

వాల్మీకిపురం-నిమ్మనపల్లె మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసు రద్దయిన మాట విదితమే. ప్రస్తుతం ఆ ప్రాంత ప్రజల నుంచి కూడా ఫిర్యాదులు వచ్చాయి. మదనపల్లె డిపోకు నూతన బస్సులు రావాల్సి ఉంది. వచ్చిన తక్షణమే ఈ మార్గాన్ని పరిశీలించి బస్సు సర్వీసు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

-వెంకటరమణారెడ్డి, మదనపల్లె వన్‌డిపో మేనేజర్

చిత్రం చెప్పిన సమస్య



పెద్దమండ్యం రైతు సేవ కేంద్రం పిచ్చిమొక్కల మధ్య ఉంటూ రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఈ సేవ కేంద్రానికి వెళ్లే దారికి ఇరువైపుల పిచ్చిమొక్కలు మొలచి విషపురుగులకు నిలయంగా మారింది. దీంతో వ్యవసాయ పనుల నిమిత్తం ఇక్కడికి రావడానికి రైతులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

-పెద్దమండ్యం, (ఆంధ్రజ్యోతి)

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

కురబలకోట, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపం వద్దగల ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ద్విచక్ర వాహనదారుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నూతనంగా నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ వద్ద ద్విచక్రవాహనంలో వెళుతున్న వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. కాగా మృతి చెందిన వ్యక్తి దాదాపుగా 37-42ఏళ్ళ మధ్య వయస్సు ఉంటుంది. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తలపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): వేధింపులకు గురిచేస్తున్న భర్త, అత్తలపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. మదనపల్లె మండలం, కొండామరిపల్లె పంచాయతీ సత్యసాయి కాలనీకి చెందిన మహేశ్వరి (23)ని అదే కాలనీకి చెందిన మారప్ప కుమారుడు పెద్దగుండ్ల నరసింహులు 2019లో ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివాహం అయిన మూడేళ్లు వారి కాపురం సజావుగానే జరిగింది. తరువాత నరసింహులు వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని మహేశ్వరిని వేధించడం మొదలుపెట్టారు. మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త, నరసింహులు, అత్త అంజనమ్మపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మరో ఘటనలో భర్త, కుటుంబసభ్యులపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): యువతిని వేధింపులకు గురిచేస్తున్న భర్త కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ కళా వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన వివరాల మేరకు మదనపల్లె మండలం, ఎగువకురవంక, రవీంద్రనగర్‌కు చెందిన షేక్ జాఫర్‌వలి కుమార్తె షేక్ కామ్యభాను(26)ను అదే కాలనీలో నివాసం ఉంటున్న షేక్ షామీర్ కుమారుడు షేక్ షఫీతో 2021లో వివాహం చేశారు. వారికి 18 నెలల పాప ఉంది. వివాహం అయిన తరువాత ఆమె భర్త, షామీర్ కుటుంబసభ్యులు వేధిస్తున్నారని ఫిర్యాదు చేయడంతో భర్త షఫీ, మామ షామీర్, అత్త ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అక్రమ నిర్మాణాలను అడ్డుకున్న వీఆర్వో



అక్రమ నిర్మాణాలను అడ్డుకొంటున్న వీఆర్వో నారాయణ

మదనపల్లె అర్బన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం, కోళ్లబైలు పంచాయతీ, అమ్మచెరువుమిట్టలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను ఆదివారం వీర్వో నారాయణ అడ్డుకున్నారు. ఇక్కడ వెలిగల్లుకు చెందిన రవికుమార్ గతంలో ఇంటి నిర్మాణం చేశారు. పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాని అక్రమించి మరో ఇంటి నిర్మాణాలను చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఖాజాబీ ఆదేశాల మేరకు వీఆర్వో అక్కడికి చేరుకుని అక్రమకట్టడాలను నిలిపివేయించారు. అక్రమంగా కట్టడాలను చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాబు కాలనీలో రోడ్డు ఆక్రమణను తొలగించాలని నిరసన



రోడ్డు ఆక్రమణలను తొలగించాలని నిరసన తెలియచేస్తున్న రైతులు

మదనపల్లె అర్బన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): బాబు కాలనీలోని జగనన్న కాలనీలో రోడ్డుకు అడ్డుగా చేపుతున్న నిర్మాణాలను తొలగించాలని పక్కనే ఉన్న రైతులు ఆ స్థలంలో నిరసన చేపట్టారు. వెంటనే వీఆర్వో నారాయణ అక్కడికి చేరుకుని అక్ర మాలు చేయరాదని హెచ్చరించారు. భూముల వద్దకు దారి లేకుండా చేయడం ఏమిటని ప్రశ్నించారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి పట్టా ఉంటే రోడ్డు విషయం తహసీల్దార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అంత వరకు ఎలాంటి కట్టడాలు ఇక్కడ చేపట్టరాదని తెలిపారు.

రామ్మూర్తినాయుడు మృతికి పలువురి సంతాపం



రామ్మూర్తినాయుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



సీఎం చంద్రబాబుతో కలిసి రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

మదనపల్లె/టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో జరిగిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడు మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక సుభాష్ రోడ్డులోని ఎమ్మెల్యే నివాసం వద్ద రామ్మూర్తినాయుడు చిత్రపటానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రగిరి ఎమ్మెల్యేగా రామ్మూర్తినాయుడు ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. అనారోగ్యంలో ఆయన మృతి చెందడం టీడీపీకి తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు షంషీర్, నాదెళ్ల శివన్న, నిమ్మనపల్లె, రామసముద్రం టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా రామ్మూర్తినాయుడు అంత్యక్రియల్లో తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్ హాజరై రామ్మూర్తినాయుడు భౌతికకాయం వద్ద పుష్ప గుచ్ఛాలుంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకర్‌యాదవ్ సీఎం చంద్రబాబునాయుడును కలిసి రామ్మూర్తినాయుడు అంత్యక్రియలకు హాజరయ్యారు.



కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాల సందర్భంగా పూలచాదర్‌ను తీసుకెళ్తున్న మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

చెరువును తలపిస్తున్న మార్కెట్



కలకడ టమోటా మార్కెట్‌లో నిలిచిన వర్షపునీరు

కలకడ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కలకడలోని టమోటా మార్కెట్ కురుస్తున్న వర్షాలకు చెరువును తలపిస్తోంది. ఈ ప్రాంతంలో వ్యాపారులు సొంతగా మండీలను ఏర్పాటు చేసుకున్నారు. అయితే వాటి ముందు ప్రాంతం గుంతలమయంగా ఉండడంతో వర్షాలకు వచ్చిన నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. అలాగే ఇక్కడి నుంచి వివిధ మార్కెట్‌లకు టామోటాలను రవాణా చేసేందుకు వచ్చే వాహనాలు తరచూ బురదలో చిక్కుకుని ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. దీనికి తోడు నీటిలో కుళ్లిన టమోటా వ్యర్థాలు కలిసి పారిశుధ్యం లోపించి పరిసరాలు దుర్గంధంగా మరాయి. ఈ మార్గంలోనే ఆదర్శ పాఠశాల, ఉర్దూ హైస్కూల్ , కేజీబీవీ పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాల్సివస్తోంది. ప్రధాన రహదారి కావడంతో కలకడ నుంచి గుర్రంకొండతోపాటు పలు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఈ మార్కెట్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన వేలం పాటల్లో పంచాయతీకి టమోటా మార్కెట్‌కు ద్వారా రూ.25 లక్షల ఆదాయం వచ్చింది. అయితే సౌకర్యాల కల్పన గురించి పట్టించుకోవడం లేదని వ్యాపారులు, రైతులు విమర్శలు వ్యక్తం చేసున్నారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

25 నుంచి 108 ఉద్యోగుల నిరవధిక సమ్మె

రాయచోటిటౌన్, నవంబరు17(ఆంధ్రజ్యోతి): 108 ఉద్యో గుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం కోసం 25 నుంచి సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా రామాంజులు ప్రక టించారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాలోని 108 ఉద్యోగుల సమావేశం జరిగిం ది. 108 వాహనాలను నిర్వహించే ప్రతి ప్రైవేట్ యాజ మాన్యం ఇయంట్, ఫైలట్ల గ్రాట్యూటీ ఎరండ్ లీవ్ అమౌంట్ వార్షిక ఇక్రిమెంట్‌లు చెల్లించకుండా వైదొలగ డంతో ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభు త్వమే 108 సర్వీసులను నిర్వహించాలన్నారు. 108 సిబ్బందికి 8 గంటల పని విధానం అమలు చేయాలని కోరారు. అనంతరం సర్వీస్ కాంట్రాక్టు ఎంప్లాయి స్ యూనియన్‌ను సీఐటీయూ అనుబంధంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, ప్రధాన కార్యదర్శి, బీవీ చలప తి, కోశాధికారి యోగానందరెడ్డి, మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. 108 ఉద్యోగులు యర్రన్న, జయరాం, శివానందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ప్రసాద్, దామోదర, బ్రహ్మానందరెడ్డి, ఆజ్మ తుల్లాబేగ్, చంద్రమౌళి, రహంతుల్లా, అమర్‌నాథ్ బాబు, ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రాజంపేటటౌన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సాయినగ ర్ సాయిబాబా ఆలయంలో ధర్మకర్తల ఆధ్వర్యంలో 25వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సాయినాధుని ప్రత్యేకంగా అలంకరించి భజన, సాంస్కృతిక కార్యక్రమా లను చేశారు. సాయినాధునికి ప్రత్యేక పూజా కార్యక్రమా లు, అభిషేకాలు నిర్వహించారు. సాయినగర్‌లో ఆలయం నిర్మించి 25 ఏళ్ల పూర్తి అయిన సందర్భంగా అన్నదానం నిర్వహించారు. రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నదానం ప్రారంభించారు.

పీటీఎంలో ఘనంగా సహకార వారోత్సవాలు

పెద్దతిప్పసముద్రం నవంబర్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దతిప్పసముద్రంలోని సహకార బ్యాంక్ కార్యాలయంలో ఆదివారం 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను బ్యాంక్ సీఈవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం ఎదుట సహకార జెండాను ఎగురవేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు సహకార బ్యాంక్‌ల ఉద్యమ ప్రగతికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ సహకార వారోత్సవాలను జరుపుకుంటున్నామని వివరించారు. బ్యాంక్ ఇన్‌చార్జ్ ఎం. శ్యాంప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సహకార బ్యాంకుల్లో బంగారు రుణాలు వ్యవసాయంపై రుణాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రైతుకు పంట రుణాలు విరివిగా అందిస్తామని తెలియచేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ చంద్రశేఖర్, సిబ్బందితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

బీఎస్పీ సభ్యత్వ నమోదు ముమ్మరంగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ ఇన్‌చార్జి మల్లికార్జున

ములకలచెరువు, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): బీఎస్పీ సభ్యత్వ నమోదును ముమ్మరంగా చేపట్టాలని ఆ పార్టీ తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దపాళ్యం మల్లికార్జున పిలుపు నిచ్చారు. మండలంలోని పాత ములకలచెరువులో ఆదివారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజన సమాజం ప్రతి ఒక్కరు సభ్యత్వం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండ1ల అధ్యక్షుడు మల్లప్ప, నాయకులు వేమన్న, విష్ణు, గంగాధర్, శంకర్, నారాయణ, కృష్ణప్ప, రమణప్ప, మహేష్, వెంకటేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కుల గణన తర్వాతే.. వర్గీకరణ జరపాలి



వాల్మీకిపురంలో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

వాల్మీకిపురం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కుల గణన చేసిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ జరపాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురంలో నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ 2011 కుల గణన ప్రకారం కాకుండా ఇప్పటి జనాభా కులగణన ప్రాతిపదికన చేపట్టిన తర్వాత ఎస్సీ వర్గీకరణ చేస్తే మాలమాదిగలందరికీ ఉపయోగ పడుతుందన్నారు. ఈ సమావేశంలో మాల మహానాడు మండల అధ్యక్షుడు నాగార్జున, నాయకులు రఘు, సుధాకర్, శ్రీనివాసులు, కమలాకర్, కేవీ రమణ, వేమనారాయణ, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో ఆక్రమణలు తొలగేనా..?

- ఎదురుచూస్తున్న పట్టణ ప్రజలు
- బస్‌షెల్టర్‌ను ఆక్రమించినా పట్టించుకోని అధికారులు



జ్యోతిసర్కిల్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ జీఆర్ పల్లవి(ఫైల్‌ఫొటో)

బి.కొత్తకోట, నవంబరు17 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణ పరిధిలో ఆక్రమణ లు తొలుగుతాయా? అనే విషయమై పట్టణ ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. చాలా ఏళ్లుగా రంగసముద్రం, పీటీ యం రోడ్డు, బెంగళూరు రోడ్డులతో పాటు మదనపల్లె రోడ్డులో సైతం దుకాణదారులు తమకు వీలు దొరికినంత మేరకు ఆక్రమించుకొన్నారు. నగరపంచాయతీ ఆస్తులు, ప్రభుత్వ ఆస్తుల ఆక్రమణల జోలికి వెళ్లకపోయినా ప్రధాన రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీని దాటి ఏర్పాటుచేసుకున్నారు. జ్యోతి సర్కిల్‌లో నిర్మించిన పురాతన బస్‌షెల్టర్‌ను సైతం ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసుకున్నా పట్టించుకున్న వారు లేరు. ఎట్టకేలకు ప్రస్తుత కమిషనర్ జీఆర్ పల్లవి ఆక్రమణల తొలగింపునకు చర్యలకు ఉపక్రమించారు. ఇందులో భాగంగా మూడురోజుల క్రితం సీఐ రాజారెడ్డి, కొంతమంది సీఆర్‌పీఎఫ్ బలగాలతో పట్టణంలోని ప్రధాన రోడ్లలో కమిషనర్ తిరిగి ఆక్రమణ దారులకు గడువు విధించారు. అయినా వారినుంచి స్పందన లేదు. దీంతో మరోసారి తమ సిబ్బందితో జ్యోతిసర్కిల్‌లో తిరిగి ఆక్రమణదారులతో మాట్లాడారు. ఇచ్చిన గడువు ముగిసిందని స్వచ్ఛందంగా తొలగించని వాటిని మేమే తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు అధికారులతో చర్చించామని పెద్దసంఖ్యలో సీఆర్‌పీఎఫ్ బలగాలను రప్పించి త్వరలో చర్య చేపడుతామన్నారు. కమిషనర్ నిర్ణయాన్ని పలువురు స్వాగతిస్తుండగా, ఆక్రమించిన ప్రదేశంలో జీవనోపాధి పొందుతున్న వారు ఆందోళన చెందుతున్నారు.

ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు రూ.లక్ష వితరణ



ఎమ్మెల్యేకు చెక్కును అందిస్తున్న టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం నిమ్మనపల్లె సర్కిల్ వద్ద ఏర్పాటు చేస్తున్న ఎన్టీఆర్ విగ్రహానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ రూ.లక్ష వితరణగా అందజేశారు. ఆదివారం స్థానిక సుభాష్ రోడ్డులో నివాసమున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఆర్‌జే వెంకటేశ్ రూ.లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌జే వెంకటేశ్ మాట్లాడుతూ మదనపల్లెలో ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహం ఎక్కడా లేదని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై స్పందించిన ఆయన మున్సిపల్ కౌన్సిల్‌లో ఒక తీర్మానం పెట్టించి, నిమ్మనపల్లె సర్కిల్ వద్ద ఎన్టీఆర్ నిలువెత్తు విగ్రహం ఏర్పాటుకు అనుమతి తీసుకున్నారన్నారు. ఇందులో భాగంగా తన వంతుగా రూ.లక్ష అందిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండు నెలల్లో ఇక్కడ ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు పూర్తి చేస్తామని, సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, నవీన్, రమేశ్, శివకృష్ణ, ఉదయ్, లక్ష్మన్న, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కొద్దేవర బొట్టుతో ఐక్యత, అనురాగం



కొద్దేవర బొట్టు కార్యక్రమానికి హాజరైన మహిళలు

తంబళ్లపల్లె, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి):పూర్వీకుల నుంచి తంబళ్లపల్లె నియోజక వర్గంలోని మెరుసుకాపు రెడ్ల (తూగు) మహిళలు నియమ నిష్టలతో నిర్వహించుకునే కొద్దేవర బొట్టు ఐక్యతకు, అనురాగానికి ప్రతీకగా నిలుస్తోందని పలువురు పేర్కొన్నారు. మండలంలోని మర్రిమాకులపల్లె పంచాయతీ తూగువారిపల్లెలో ఆదివారం తూగువారి దాయాది మహిళలు కొద్దేవర బొట్టు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. దేవర పెద్ద వీరభద్రారెడ్డి కుల దైవం వీరభద్రస్వామి ఆలయం(దేవరిల్లు)లో స్వామి వారికి దూపదీప నైవేద్యాలతో పూజలు నిర్వహించారు. అనంతరం కొర్రలు, పచ్చి వరి ఎన్ను, బెల్లం, పసుపు మిశ్రమాన్ని తయారు చేసి కొద్దేవర బొట్టుగా పచ్చని ఆకులలో మహిళలకు పంపిణీ చేశారు. మహిళలు ఉపవాసంతో ఈ కార్యక్రమానికి హాజరై బొట్టు మిశ్రమాన్ని నుదుట ధరించి ఆరగిస్తారు. దీంతో వారికి ఆరోగ్యం చేకూరుతుందని వారి నమ్మకం. ఇక ఉద్యోగ రీత్యా సుదూర ప్రాంతాలలోని మహిళలందరూ కొద్దేర బొట్టు కార్యక్రమానికి హాజరుకావడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా చెప్పుకుంటారు. కార్యక్రమానికి పెద్దఎత్తున మెరుసుకాపు రెడ్ల (తూగు) మహిళలు తరలిరావడంతో వీరభద్రస్వామి ఆలయం కిటకిటలాడింది.

వైభవంగా అయ్యప్పస్వామి అంబలం పూజ



తంబళపల్లెలో అంబలం పూజ నిర్వహిస్తున్న స్వాములు

తంబళ్లపల్లె, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలంలోని బురుజుపల్లెలో అయ్యప్ప స్వామికి అంబలం పూజా మహోత్సవాన్ని శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి పిలకలు, రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలతో మండపాన్ని సుందరంగా ఆకర్షణీయంగా అలంకరించారు. అయ్యప్పస్వామిని మండపంలో కొలువుదీర్చి గురుస్వామి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురుస్వాములు, స్వాముల చేసే భజనలు, కీర్తనలతో మండప ప్రాంగణమంతా పులకరించిపోయింది. అనంతరం కజ్జయి కార్యక్రమం నిర్వహించి అగ్నిగుండ ప్రవేశం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సంతాన లక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివా రం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వ హించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. దీంతో అమ్మవారిని దర్శించుకోవ డానికి వివిధ ప్రాంతాలు, బయట రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి పూజలు చేశారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరిచారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈవో మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

నేలమల్లేశ్వరస్వామి ఆలయానికి రోడ్డు నిర్మించాలి

- భక్తుల వినతి
- బురదమయంగా ముద్దిరెడ్డిగారిపల్లి రహదారి



నిమ్మనపల్లి, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని తవలం అటవీ ప్రాంతం రుషి భూమిలో వెలసిన నేలమల్లేశ్వరస్వామి ఆలయం వద్దకు ముద్దిరెడ్డిగారిపల్లి నుంచి 3కిలోమీటర్లు ఉన్న రోడ్డును వెంటనే నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. 15ఏళ్ల క్రితం తారు రోడ్డు వేసేందుకు ప్రతిపాదనలు వచ్చాని అప్పుడు ఎన్నికలు రావడంతో పనలు చేపట్టలేదని స్థానికులు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో రోడ్డు నిర్మించ లేదు కదా కనీసం మట్టిని తోలి గుంతలు కూడా పూడ్చలేదన్నారు. ఆలయానికి నల్లంవారిపల్లి నుంచి రోడ్డు మార్గం ఉన్నా పండుగ సమయాల్లో ఆలయం వద్ద రద్దీ ఏర్పడినప్పుడు ముద్దిరెడ్డిగారిపల్లిలో వుండే రెండవ రోడ్డు ద్వారా వాహనాలు వెళుతాయన్నారు. అంతే కాకుం డా ఆదే మార్గంలో బుచ్చిరెడ్డిగారిపల్లి, ముద్దిరెడ్డిగారిపల్లి మల్లేశ్వరం గ్రామాల ప్రజలు ఎక్కువగాఇదే మార్గం ద్వారా ఆలయాని చేరుకొంటున్నట్లు తెలిపారు. అయితే ఈ మార్గంలో చినుకు పడితే రోడ్డు బురద మయం కావడంతో వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అయినా నేలమల్లేశ్వరస్వామి ఆలయం వద్దకు రోడ్డు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.